ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




ఆదివారం 16 ఆగస్టు 2026 | సంపుటి: 28 సంచిక: 128 | Sunday 16 August 2026 | Vol.No 28 Issue No .128 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA | www.visionandhra.in

భారత్‌కు ప్రపంచస్థాయి

## నాయకత్వ లక్షణం

- అన్ని రంగాల్లో దూసుకు పోయే తత్వం
- సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం
- యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు
- జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి
- దానితోనే దేశ అభివృద్ధి ప్రణాళికలు రచించగలం
- ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ పిలుపు
- ఎర్రకోట వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే





## దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

మిగతా 2లో..

- ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం
- ఆర్థిక,సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం
- సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ

# సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది

- కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదు
- 31 నెలల కృషి ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి
- తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నాం
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటదన్న నమ్మకం
- అధికారంలోకి రాగానే 2లక్షల రుణామఫీ చేపట్టాం
- గోల్కొండలో జెండా ఎగరేసిన సిఎం రేవంత్ రెడ్డి

కీలక బాధ్యతగా

### ఉద్యోగ నియామకాలు

- ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- గ్రూప్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాం
- త్వరలోనే ఇంటర్‌నేషనల్ స్పోర్ట్స్ నిర్వహణ
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం
- తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నాం
- గోల్కొండ కోట నుంచి ప్రజలనుద్దేశించి సిఎం రేవంత్ ప్రసంగం





హైదరాబాద్,ఆగస్ట్15 : తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ పడేది లేదని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల కళ్లలో ఆనందం చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గోల్కొండ కోటలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడకలకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరై జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విద్య, వైద్యం.. ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశాలని తెలిపారు.సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్కొండ కోటపై సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ.. ఈ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని.. తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నామన్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించామని తెలిపారు. రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి.. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టామన్నారు. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లు పెట్టుబడి సాయం అందించామని చెప్పారు. అలాగే, రైతు సంక్షేమం కోసం రూ.లక్షా 70వేల కోట్లు, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని వివరించారు. సన్న వడ్లకు

మిగతా 2లో..

## దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

- 89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం
- బిఆర్ఎస్ నేతలు తప్పడు ప్రచారాలు మానాలి
- సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సంగారెడ్డి,ఆగస్ట్15 : తెలంగాణలో ఇస్తున్నట్టు దేశంలో ఎక్కాడా కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్

మిగతా 2లో..

# రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక

- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్
- రేషన్ కార్డులతో పాటు.. సన్న బియ్యం ఘనత మాదే
- సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- కెసిఆర్ వస్తే ఎవరేం చేశారో చర్చిస్తాం
- బిజెపి, బిఆర్ఎస్ నాణెనికి బొమ్మా బొరుస లాంటివి
- సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సిఎం రేవంత్

### పేదరికం నిర్మూలించే బలమైన అడుగు




సంగారెడ్డి,ఆగస్ట్15 : స్మార్ట్ రేషన్ కార్డు అనేది కేవలం ఒక ప్లాస్టిక్ కార్డు లేదా ఉచితంగా బియ్యం పొందే సాధనం మాత్రమే కాదని, పేదరికాన్ని నిర్మూలించే దిశగా వేసిన బలమైన అడుగని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ పేదవాడు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ నాడు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చిందని అన్నారు. గతంలో ఇందిరాగాంధీని మెదక్ ఎంపీగా గెలిపించడం వల్లే ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిందని కొనియాడారు. సంగారెడ్డి

మిగతా 2లో..

## పేదల పెన్నిది మా సర్కార్

- స్మార్ట్ కార్డుల పంపిణీలో మంత్రి పొంగులేటి



హనుమకొండ,ఆగస్ట్15 : పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్ పాయిలతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను

మిగతా 2లో..

చరిత్ర తెలుసుకుంటేనే...

## భవిష్యత్ నిర్మాణం

- టిఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత



హైదరాబాద్,ఆగస్ట్15 : చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ... బ్రిటీష్ పాలనలో జరిగిన అఘాయిత్యాలు,

మిగతా 2లో..

## ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

- అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో డిప్యూటి సిఎం భట్టి



ఖమ్మం,ఆగస్ట్15 : తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నకిలీలను పూర్తిగా అరికట్టేందుకు ఈ కొత్త స్మార్ట్ కార్డులలో ఎన్క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, ప్రత్యేక హోలోగ్రామ్, వాటర్ మార్క్, యూవీ లోగో సహా 9 రకాల పటిష్టమైన భద్రతా ఫీచర్లను పొందుపరిచామని భట్టి అన్నారు. ఈ-పాస్ యంత్రాలతో బయోమెట్రిక్ విధానాన్ని అనుసంధానించి రేషన్ పంపిణీలో నూరు శాతం పారదర్శకతను తీసుకువస్తున్నామన్నారు. ాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా 3.42 కోట్ల మందికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సరికొత్త డిజిటల్ కార్డులు మంజూరు చేస్తూ, వాటి ద్వారా అనేక సంక్షేమ

మిగతా 2లో..

సంగారెడ్డి సభలో

## రేవంత్ అబద్ధాల ప్రచారం

- కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న పెద్దమనిషి
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు



సిద్దిపేట,ఆగస్ట్15 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. సంగారెడ్డిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. దేశంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజునా చిల్లర మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి మరొకరు ఉండరని

మిగతా 2లో..

## స్త్రీశక్తి పథకానికి ఏడాది పూర్తి

- మహిళతో కలసి బస్సులో ప్రయాణించిన బాబు
- పథకం అమలు తీరుతెన్నులపై మహిళలతో సంభాషణ
- మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందని వివరణ



అమరావతి,ఆగస్ట్15 : కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన స్త్రీశక్తి ఉచిత బస్సు పథకానికి నేటితో ఏడాది పూర్తైంది. మహిళల ఆర్థిక సాధికారత కోసం గతేడాది ఆగస్టు 15వ తేదీన 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ సందర్భంగా స్త్రీ శక్తికి సంవత్సరం- రెట్టింపైన ఆత్మగౌరవం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. రాజధానిలోని పరేడ్ గ్రౌండ్స్ నుంచి మహిళలతో బస్సులో ప్రయాణం చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్స్ నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ మీదుగా సీఎం క్యాంప్ కార్యాలయం వరకు బస్సులో మహిళలతో కలిసి ముఖ్యమంత్రి ప్రయాణం చేశారు. స్త్రీ శక్తి పథకం అమలు తీరు తెన్నుల గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. మహిళల కుటుంబ స్థితిగతులపై ఆరా తీశారు. ఓ మహిళా రైతుతో సంభాషించిన ముఖ్యమంత్రి... ప్రభుత్వం ఇచ్చే పథకాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. చేపలు అమ్ముకునే ఓ మహిళతో సీఎం మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం ద్వారా తనకు నెలకు రూ. 4 వేలు ఆదా అవుతోందని

మిగతా 2లో..

ప్రపంచానికి

## నాయకత్వం వహించే దిశగా భారత్

- కాకినాడలో జెండా ఆవిష్కరించిన డిప్యూటి సిఎం పవన్



కాకినాడ,ఆగస్ట్15 : బలమైన, సమర్థ దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందన్నారు. వికసిత్ భారత్ సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ తనదైన పాత్ర పోషిస్తోందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో పవన్ కల్యాణ్ పాల్గొని జాతీయజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక తరం స్వాతంత్ర్యం కోసం

మిగతా 2లో..

చేతిలో జాతీయ జెండా..

## గుండెలో బలమైన ఎజెండా

- దేశంకోసం త్యాగం చేసిన వారి స్ఫూర్తితో ముందుకు సాగాలి
- అమరావతిలో తొలిసారిగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుక
- జెండా అవిష్కరించి...ప్రసంగించిన సిఎం చంద్రబాబు



అమరావతి,ఆగస్ట్15 : మన చేతిలో జాతీయ జెండా ఉండాలి.. మన గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై జాతీయ జెండాను ఎగుర వేశారు.ఏపీ రాజధాని అమరావతిలో

మిగతా 2లో..

## ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్

పోరాడితే.. ఒక తరం స్వాతంత్ర్యాన్ని కాపాడిందన్నారు. బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని అన్నారు.వికసిత్ భారత్ సంకల్పంలో ఆంధ్రప్రదేశ్ తనదైన పాత్ర పోషిస్తుందని అన్నారు. కేంద్ర సమన్వయంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చేతిలో జాతీయ జెండా..గుండెలో బలమైన ఎజెండా

తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. రాయపూడిలోని పరేడ్ గ్రౌండ్‌లో స్వర్ణాంధ్ర-2047 థీమ్‌తో వేడుకలు నిర్వహించారు. రాజధానిలో జరుగుతోన్న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుక జరిగే వేదిక వద్దకు సీఎం కాన్వాయ్‌తో బుల్లెట్ ఎస్కార్ట్ చేరుకుంది. ఈ సందర్భంగా సీఎంకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఆపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. పోలీసు దళాల గౌరవ వందనాన్ని ముఖ్యమంత్రి స్వీకరించారు. ఏపీఎస్పీ సహా వివిధ పోలీసు దళాల సన్నద్ధతను చంద్రబాబు సమీక్షించారు. అనంతరం పోలీసు బలగాలు, ఎన్సీసీ క్యాడెట్లు, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళం.. మార్చ్ పాస్ట్ నిర్వహించాయి. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు సీఎంకు స్వాగతం పలికారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు నేల కూడా స్వాతంత్ర్య సమరంలో తనదైన ముద్ర వేసిందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఏపీ ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమేనన్నారు. దేశం మనకు హక్కులు, గుర్తింపు, గౌరవం తీసుకొచ్చింది. నా దేశం, నా బాధ్యత అని ముందుకుసాగాలి. దేశం నాకు ఏం చేసిందని కాదు... దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలని కోరారు. 2047 నాటికి వికసిత్ భారత్... స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు... వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలన్నారు. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు.

## చరిత్ర తెలుసుకుంటేనే... భవిష్యత్ నిర్మాణం

విభజించి పాలించిన విధానం అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయులను సైనికులుగా వాడుకొని ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు. బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతే కుల వ్యవస్థ మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. అడవుల్లో ఉండే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన పోయినప్పటికీ వాళ్ల ఆలోచనా విధానాన్నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్లే గొప్ప అన్నట్లుగా చూస్తున్నారని.. తెలుగు భాష మాట్లాడితే తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. 'తెల్ల తోలు గొప్ప, నల్ల తోలు కాదన్నట్లుగా ప్రచారం చేసి మనలో మనల్ని శత్రువులను చేశారు' అని అన్నారు. ఆనాటి బ్రిటీష్ వాళ్ల పరిపాలన, ఆలోచనా విధానాన్ని వీడాలని కవిత పేర్కొన్నారు.

## పేదల పెన్నిది మా సర్కార్

పంపిణీ చేశారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రేషన్ కార్డు అనేది కేవలం ఒక గుర్తింపు పత్రం కాదని, పేద కుటుంబాలకు ఆహార భద్రతతోపాటు అనేక సంక్షేమ పథకాలకు ఆధారమని పేర్కొన్నారు.

## ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాం.పేదలకు మెరుగైన వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కల సాకారం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేలా మన ప్రభుత్వం అడుగులు వేస్తోందని భట్టి తెలిపారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని భట్టి చెప్పుకొచ్చారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## సంగారెడ్డి సభలో రేవంత్ అబద్ధాల ప్రచారం

విమర్శించారు. సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి హరీశ్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం 4:20 గంటలకు ప్రసంగం ప్రారంభించి 420 మాటలు మాట్లాడారని మండిపడ్డారు. ఆయన తన ప్రసంగంలో ఉమ్మడి మెదక్ జిల్లా గురించి ఒక్క మాటా మాట్లాడలేదని ధ్వజమెత్తారు. రేవంత్ చేతకానితనం వల్లే సింగూరు ఖాళీ అయిందని ఆరోపించారు. కామారెడ్డి జిల్లాకు మంచినీళ్లు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి బాగుపడాలని గత ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మూలన పడేసిందని నిప్పులు చెరిగారు. జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహం ప్రారంభించి ఏడాది అయిందని, ఆ రోజు ఇచ్చిన హామీలు ఒక్కటైనా అమలయ్యాయా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లాలో ఈ మూడేళ్లలో ఒక్క రోడ్డు అయినా వేశారా? అని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షలకు పైగా రేషన్ కార్డులు ఇచ్చారని అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ నేడు సంగారెడ్డిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని చెబుతున్నారని ఆగ్రహించారు. నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడే రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తే రేవంత్ నియామక పత్రాలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఎంపీ రాహుల్ గాంధీని పిలిచి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, మాట తప్పినందుకు నిరుద్యోగులకు రేవంత్ క్షమాపణలు చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. గన్‌మెన్లు లేకుండా అశోక్ నగర్‌కు వస్తావా? అంటూ ఈ సందర్భంగా మాజీ మంత్రి సవాల్ విసిరారు. మరోవైపు, రెండేళ్ల ఫీజురీయింబర్స్‌మెంట్ ఎప్పుడూ ఇస్తారో చెప్పాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని ఆ కాలేజీలు, విద్యార్థుల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారని మండిపడ్డారు. అలాగే, రైతుల గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదన్నారు. కేసీఆర్ హయాంలో వరుసగా మూడేళ్లలో రూ.14,656 కోట్లు, రూ.14,721 కోట్లు, రూ.14,721 కోట్లు చొప్పున రైతు బంధు ఇచ్చారని పేర్కొన్నారు. 2024-25లో రేవంత్ ఇచ్చింది రూ.5,057 కోట్లేనని మండిపడ్డారు. 2025-26లో రూ.11 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన దానికంటే రూ.15 వేల కోట్లు రేవంత్ తక్కువ ఇచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి సొంత ఊరికి వెళ్లి రుణమాఫీ అయ్యిందో, లేదో అక్కడి రైతులను అడగాలన్నారు. ఆ రైతులు రుణమాఫీ అయ్యిందని చెబితే తాను రాజీనామా చేస్తానని, అవ్వలేదని చెబితే రేవంత్ రెడ్డి రాజీమానా చేస్తారా? అని సవాల్ చేశారు.

## రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక

వేదికగా జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని లబ్దిదారులకు కార్డులను అందజేశారు. నాయకుడు జగ్గారెడ్డి పర్యవేక్షణలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేలాదిమంది మహిళల సమక్షంలో ఈ సభ నిర్వహించు కోవడం ఎంతో ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకునే తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు వేర్వేరు కాదని, ఆ రెండు పార్టీలు ఒకే నాణెనికి బొమ్మ, బొరుసు లాంటివని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఏనాడైనా పేద ప్రజల ఆకలి తీర్చాలని ఆ పార్టీలు ఆలోచించలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో దాదాపు 3 కోట్ల 48 లక్షల మంది ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన బియ్యం దొడ్డుగా ఉండి, మనుషులు తినలేక బర్లకు దాణాగా వేసే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు తాము ఇస్తున్న సన్న బియ్యం ప్రతి పేద కుటుంబానికి కడుపు నింపుతోందని వివరించారు. తెలంగాణలో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో వీటిని

## భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

న్యూఢిల్లీ,ఆగస్ట15 : భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, అన్నిరంగాల్లో దూసుకుపోయే సమర్థత ఉందని ప్రధాని మోదీ అన్నారు. సవాళ్లు స్వీకరించి ముందుకు సాగడం ద్వారా మనమేంటో సత్తా చూపగలమన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యవత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా..? అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. 'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని సూచించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు. మహిళా కోటా బిల్లుపై

## సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది

రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డులు సృష్టించిందని తెలిపారు. కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామన్నారు. త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఇళ్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని,2 విడతల్లో 5.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని తెలియజేశారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన జరిగిందని.. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేర్చిందని తెలిపారు. కొత్తగా 2.50లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సూచీలో 21 నుంచి 14వ స్థానానికి తెలంగాణ చేరిందని రేవంత్ తెలిపారు. నియోజకర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. స్కూళ్లలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం పెడుతున్నామని, 100కు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు నిర్మించే

### దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 3.42 కోట్ల మందికి రూ.14800 కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే.. వాటిని 2.80 కోట్లకు పెంచామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు.. నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోని నేతలు పదే పదే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండా దేశంలోనే ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణలో పండించామన్నారు. వరి కొనుగోళ్లలో రూ.90 వేల కోట్లు.. రైతుల ఖాతాల్లో వేశామని అన్నారు. ఈరోజు సంగారెడ్డి చరిత్రలోనే కాదు, తెలంగాణ చరిత్రలోనే ప్రత్యేకమైన రోజుగా

## స్త్రీశక్తి పథకానికి ఏడాది పూర్తి

మత్స్యకార మహిళ తెలిపింది. మత్స్యకార మహిళ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు సీఎం. తనకు చక్కెర వ్యాధి ఉందని... ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే లబ్ధితో మందులు కొనుగోలు చేస్తున్నట్టు సదరు మహిళ వెల్లడించింది. ఆరోగ్య అలవాట్లు మార్చుకుంటే అనారోగ్యం దరిచేరదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. ఆరోగ్యం మెరుగ్గా ఉంటే... సంపాదనను మందుల కొనుగోలు ఖర్చులను ఆదా చేసుకోవచ్చని చెప్పారు. స్త్రీ శక్తి పథకం వల్ల తనకు నెలకు రూ. 1500 ఆదా అవుతోందని నంద్యాల నుంచి వచ్చిన ముస్లిం మహిళ తెలిపింది. స్త్రీ శక్తి పథకం సహా తనకు మొత్తంగా నాలుగు పథకాలు అందుతున్నాయని మహిళ పేర్కొంది. అలాగే విద్యార్థినులకు స్త్రీ శక్తి పథకం చాలా ఉపయోగంగా ఉందని ఓ యువతి వెల్లడించింది. స్త్రీ శక్తి పథకంతో పాటు.. నేతన్న సేవలో పథకం ద్వారా మరింత ఆదాయం వస్తోందని ఉమ్మడి అనంతపురానికి చెందిన చేనేత మహిళ తెలిపింది. ముడి సరుకు తెచ్చేందుకు... నేసిన చీరలను షాపులకు మార్కెటింగ్

రూపొందించినట్లు పేర్కొన్నారు. దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. పేదలకు రూ.14,800 కోట్లతో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాకే ఇవ్వడం ప్రారంభించాం. రేషన్ విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని ఎవరూ తినేవారు కాదు.. పైగా పక్కదారి పట్టేవి. పేదల ఆకలి తీర్చేదే ఈ స్మార్ట్ రేషన్ కార్డు. అసలు రేషన్ షాపులు తెచ్చిందే కాంగ్రెస్. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలని ఇందిరమ్మ ఆలోచన చేశారు. వారికి సంక్షేమం అందించడం మా బాధ్యత. రేషన్ కార్డు అనేది పేదల ఆత్మగౌరవం. వారికి ప్రతినెలా 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నాం. దీని వల్లే మార్కెట్‌లో బియ్యం ధరలు తగ్గాయన్నారు. ల్గ÷తులకు ఎవరేం చేశారో అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?. పదేళ్లలో మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో చర్చిద్దాం అని సవాల్ చేశారు. అతి తక్కువ అప్పుల్లో తెలంగాణ రైతులు ఉన్నారని కేంద్రం చెబుతోంది. కేంద్రం చెప్పేది బీజేపీ నేతలకు కనిపించడం లేదా అని అన్నారు. రైతులు పండించిన వడ్లకు రూ.90 వేల కోట్లు బదిలీ చేశాం. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు నొక్కారు. గతంలో పాలపిట్ట చీరలు ఇచ్చాం.. ఈసారి చిలకపచ్చ చీరలు ఇస్తాం.

ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా ఫర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక్ ప్రపంచంలో చిప్‌ల విలువను భారతదేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సమీప భవిష్యత్తులో మరిన్ని సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆపడం అసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సంభవించిన విపత్తుల గురించి ప్రస్తావించారు. బాధిత కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం. వంద గిగావాట్ల అణు ఇంధనం సాధించడం మనలక్ష్యం అన్నారు. ఇటవలే హైడ్రోజన్ రైలును విజయంతంగా నడిపించాం. 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే రైల్ల ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. 10 ఏళ్లలో 70 శాతం రైల్ల ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశాం. ఇటీవలే హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని అన్నారు. 50 లక్షల ఇళ్లకు సౌరశక్తి విద్యుత్ అందిస్తున్నాం. దేశంలో ఐదు న్యూక్లియర్ రియాక్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మోదీ తెలిపారు.అయితే స్వాతంత్ర్య వేడుకల్లో ఈసారి కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. సీటింగ్, ఇతర ప్రొటోకాల్స్ వారి పదవులకు అనుగుణంగా ఉండటం లేదని కాంగ్రెస్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారు వరుసగా రెండోసారి గైర్హాజరయ్యారు.

యోచనలో ఉన్నామని చెప్పారు. అక్రమాలు జరగకుండా ÷ఉఖఆని ప్రక్షాళన చేశామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే ఉస్మానియా కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణంలో ఉంది. 8 కొత్త మెడికల్ కాలేజీలకు భవనాలు నిర్మిస్తున్నాం. విద్యా సూచీలో 21వ స్థానంలో ఉన్న తెలంగాణ 14కు చేరుకుంది. నియోజకవర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టాం. వందకు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మించే లక్ష్యంతో ఉన్నాం. ప్రభుత్వ స్కూళ్లలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెడుతున్నాం. అక్రమాలు జరగకుండా టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని అన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహించాం. త్వరలో జరిగే ఖేల్ ఇండియా పోటీలకు హైదరాబాద్ అతిథ్యం ఇస్తుంది. టీఎస్ ఐపాస్ ద్వారా రూ.1.95లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మరో 78వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్ జీసీసీలు ఏర్పాటు చేస్తున్నాయి. నగరంలో ఇప్పటికే 355కు పైగా జీసీసీలు పనిచేస్తున్నాయి. అమెజాన్ సంస్థ రాష్ట్రంలో 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ఉక్కు సంకల్పంతో ఉన్నాం. మహిళలను ఆర్టీసీ అ÷-దదె బస్సులకు యజమానులుగా చేశాం. 15 లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశాం. రెండో విడత కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఇవాళే ప్రారంభించుకుంటున్నాం. వృద్ధ తల్లిదండ్రుల కోసం చట్టం చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని సీఎం వివరించారు.

నిలిచిపోనుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. ఃఖా హయాంలో రేషన్ కింద దొడ్డు బియ్యం ఇచ్చారని.. అప్పుడు ఆ బియ్యాన్ని ఎవరూ తినకుండా కిలో రూ.10కి అమ్ముకునే వారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి వాటినే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాణ్యత ఉన్న సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు చరిత్రలో పండుగలా గుర్తుండిపోతుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం

చేసేందుకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయాణిస్తున్నామని మహిళ పేర్కొంది. గతంలో తన భర్త ఒక్కరే బయటకు వెళ్లి వ్యాపారం చేసేవారని... ఇప్పుడు తాను కూడా బయటకు వెళ్లి వ్యాపారాభివృద్ధి కోసం పని చేయగలుగుతున్నామని చేనేత మహిళ చెప్పుకొచ్చింది.పీలోని పేద, మధ్య తరగతి ప్రజలు, కుటుంబాల స్థితిగతులను తెలుసుకునేందుకు ఈ తరహాలో తాను ముఖాముఖి అవుతున్నానని మహిళలకు సీఎం చంద్రబాబు చెప్పారు. 5 కేటగిరీల బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలు అవుతోందని.. ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లె వెలుగు, ప్లలెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ కేటగిరీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో వివిధ వర్గాల మహిళలు 87 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. రోజుకు 24 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారన్నారు. 9,978 బస్సుల్లో.. 7,631 బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలవుతోందని తెలిపారు. మొత్తం ఒఖఖిఅలో ఉన్న 76 శాతం బస్సుల్లో పథకం అమలు చేస్తున్నామన్నారు. స్త్రీ శక్తికి ముందు బస్సు ప్రయాణాల్లో మహిళల వాటా 40 శాతం ఉండగా..

ఆడబిడ్డలకు ఉచిత బస్సు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్ అంటూ డబ్బా కొట్టారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాలేదు కానీ వారికి మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. మేము 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నాం. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరేలేదు. కొత్తగా 2.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశాం. అర్హులైన చేనేత, గీత కార్మికులందరికీ పెన్షన్లు ఇస్తాం అని సిఎం అన్నారు. పదేళ్లపాటు మహిళలకు మంత్రి పదవి ఇవ్వని వారు నేడు మహిళల గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. అగ్గిపెట్టె రావు, అఘోరా రావులు వస్తారు.. జాగ్రత్త. వీళ్లకు అగ్గిపెట్టెలు దొరకవు కానీ అమాయక యువతను మాత్రం బలిచేశారు. శవాలపై పెట్టుబడులు పెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు నిలబడి ఉంటామని రేవంత్ అన్నారు.. ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. దుర్మార్గులు, దుష్టులు మాయమాటలతో వస్తారు. యువత అప్రమత్తంగా ఉండాలి. మాయమాటలను నమ్మొద్దు. బీఆర్ఎస్ వాళ్లు చేసిన అప్పులకు రూ.75 వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యుఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోదీ అభివర్ణించారు. కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాద కతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించు కోవాలని చెప్పారు. అలాగే నెక్స్ట్-జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6జ సాంకేతికతను దేశంలోని మూలమూలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, లాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు.

## కీలక బాధ్యతగా ఉద్యోగ నియామకాలు

ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటి వరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రూప్1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. యువతకు నైపుణ్యం, ఉద్యోగాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీ, యంగ్ ఇండియా డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తెలంగాణ వేదికగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ 2026 నిర్వహించ బోతున్నామని చెప్పారు. గోల్కొండకోటలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన సిఎం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, నిమ్స్‌లో 2,000 పడకల నూతన ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్ సెంటర్ నిర్వహణ ఇందుకు నిదర్శనమని, ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.18 లక్షల మందికి రూ.2,526 కోట్ల సాయం అందించామని వివరించారు.

వచ్చాక 16 లక్షల కొత్త కార్డులు ఇచ్చాం. గతంలో రేషన్‌లో దొడ్డు బియ్యం వచ్చేవి. ఆ బియ్యాన్ని 80 శాతం మంది తినేవారు కాదు. కానీ, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక సన్నబియ్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొంటున్నాం. మనిషికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారి అర్హతలను పరిశీలించి కార్డులు ఇస్తాం అని ఉత్తమ్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డు అంటే కుటుంబానికి గౌరవమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు అంటే ఆహార భద్రత, ప్రభుత్వం ఇచ్చే ఒక గుర్తింపు అని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు ఇక్కడ అమలు చేస్తున్నామని, నియోజకవర్గానికి మూడు వేల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు.

పథకం అమలుతో 62 శాతం మహిళల ప్రయాణాలు పెరిగాయన్నారు. స్త్రీ శక్తి అమలుతో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాబోయే 10 ఏళ్లలో ఏయే లక్ష్యాలను నిర్దేశించుకున్నారంటూ సీఎం ప్రశ్నలు వేశారు. కోటి రూపాయల పెట్టుబడితో తన డ్వాక్రా సంఘం నుంచి వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కడప జిల్లాకు చెందిన ముస్లిం మహిళ తెలిపింది. ఏఐ రంగంలో నైపుణ్యం సాధించడం ద్వారా తాను ఎంచుకున్న సాఫ్ట్‌వేర్ రంగంలో టాప్ పొజిషన్‌లోకి వెళ్లాలని విశాఖకు చెందిన ఓ ఉద్యోగిని వివరించింది. స్త్రీ శక్తి ద్వారా సుమారు రూ.3 వేలు ఆదా చేసుకోగలుగు తున్నామని యువతి తెలిపింది. ప్రభుత్వం అందిస్తోన్న పథకాలతో మహిళలే ఎక్కువగా సంపాదిస్తు న్నారని.. తాము కూడా మరికొందరికి ఉపాధి చూపగలుగుతున్నామని పలువురు మహిళలు చెప్పుకొచ్చారు. అమరావతి నిర్మాణాలను చూడాలని ఉందని మహిళలు కోరగా.. రాజధానిలో మహిళల పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. రాబోయే రోజుల్లో అందరి ఆదాయం పెరగాలి.. అందరి ఆరోగ్యం బాగుండాలి.

# సంపాదకీయం

## ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు !

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే...పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదేశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ది కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ దానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ది లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు.ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది

## బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండా ఆవిష్కరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

కరీంనగర్, ఆగస్టు 15 విజన్ ఆంధ్ర కరీంనగర్ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం రోజు పంద్రాగస్టు స్వాతంత్ర్య వేడుకలను కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి గీతాలు, 'భారత్ మాతా కీ జై' నినాదాలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ.. ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభ్యున్నతి కోసం, భవిష్యత్తు తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం ఐక్యంగా ఉండి ముందుకు కొనసాగాలని తెలిపారు. వికసిత్ భారత్' లక్ష్యంగా దేశం ముందుకెళ్తోందని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మాజీ డిప్యూటీ



మేయర్ జి. రమేష్, మాజీ ఎమ్మెల్యే శోభక్క, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు , 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, మీడియా సెల్ కన్వీనర్ కటకం లోకేశ్, ఉప్పర పల్లి శ్రీనివాస్ , కార్పొరేటర్లు, బిజెపి రాష్ట్ర ,జిల్లా నాయకులు కార్యకర్తలు ,వివిధ మోర్చా బాధ్యులు, మండల, నగర జోన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## హన్మకొండలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 విజన్ ఆంధ్ర)భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు హన్మకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ,, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు. హన్మకొండ జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని కొనియాడారు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, మత్స్య,



గృహ నిర్మాణ, విద్య, జీడబ్ల్యూఎంసీ, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖలు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను శకటాలు, ప్రదర్శనల ద్వారా వివరించాయి. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చి, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, ప్రదానం చేశారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డిసిపి ధార కవిత, ఆదనవు కలెక్టర్ రవి, డిఆర్ ఓ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, నగర ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోడుప్పల్ కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన తోటకూర వజ్రేష్ యాదవ్,తోటకూర అజయ్ యాదవ్

బోడుప్పల్,ఆగస్ట్15(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ,బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బోమ్మక్ కళ్యాణ్ కుమార్,చెంగిచర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దీలిప్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్



ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని వారు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలు అందజేశ

బోడుప్పల్,ఆగస్ట్15(విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీమతి ఎ. శైలజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నగర పరిశుభ్రతకు విశేష సేవలందిస్తున్న ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులను డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ శాలువాలతో సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈమేరకు ఆమే మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల అంకితభావంతో కూడిన




సేవలు నగర పరిశుభ్రతకు ఎంతో దోహదపడుతున్నాయని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలోమాజీ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్,సామల బుచ్చిరెడ్డి,బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి,బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,మాజీ కార్పోరేటర్లు,వివిధ పార్టీ నాయకులు, సర్కిల్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ అవరణలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

### జెండావిష్కరించిన ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్

బోడుప్పల్,ఆగస్ట్ 15(విజన్ ఆంధ్ర) : మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్డేమాను సుందర్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజ అభివృద్ధిలో జర్నలిస్టులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి మరాటి మల్లేష్, ఉ




పాధ్యక్షుడు చింత రమేష్, కార్యవర్గ సభ్యులు భూషా గణేష్, జక్కు భగీరథ్ రెడ్డి, మరాటి మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమల్లారెడ్డి సెక్రటరీకి ఛార్జ్ మెమో -ఎట్టకేలకు కదిలిన అధికారగణం



కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 15(విజన్ఆంధ్ర) కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి కి ఛార్జ్ మెమో జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి మురళి తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు సుమారు 24 లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు ఆ గ్రామ వార్డు సభ్యులు ప్రజావాణిలో నేరుగా జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జడ్పీ సీఈఓ చందర్ నాయక్ విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో కార్యదర్శికి ఛార్జ్ మెమో ఇచ్చినట్లు డీపీవో మురళి తెలిపారు. ప్రస్తుతం పెద్దమల్లారెడ్డి పంచాయతీ నిధులకు సంబందించిన చెక్కులపై ఎంపీవో సంతకం ఉంటుందని చెప్పారు. ఇదిలావుండగా నిధుల దుర్వినియోగం సంబందించిన వ్యవహారంలో పంచాయతీ శాఖలో ఒక అధికారి తెర వెనుక చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. మొదటి నుండి ఆ శాఖలో అన్నీ తానై నడిపిస్తున్నట్లుగా చెప్పుకొని కార్యదర్శులను వెనకేసుకొస్తున్న సదరు అధికారి ఇప్పుడు ఛార్జ్ మెమోపై తనదైన శైలిలో తెర వెనుక సహాయం అందిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయం గ్రామంలో గుప్పుమనడంతో నిధుల విషయమై జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ఆసక్తి నెలకొంది.

## శ్రీ గాయత్రీనగర్ కాలనీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఎల్బీనగర్, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గం సాహెబ్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ గాయత్రీనగర్ కాలనీ పార్క్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నేనావత్ సూర్య నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేనావత్ సూర్య నాయక్ మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందేందుకు అనేక మంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదని, దేశ అభివృద్ధి, ఐక్యత, ప్రగతిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మంచి విద్యను అభ్యసించి దేశ పురోగతికి తోడ్పడటం, సమాజంలో ఐక్యతను చాటడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, బాధ్యతగల పౌరులుగా జీవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై ఒకరినొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు, పిల్లలు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి చైతన్య రెడ్డి, సహాయ కార్యదర్శి గంగాధర్, కమిటీ సభ్యులు నాగేందర్, అన్నవరపు ప్రసాద్, శివరామకృష్ణ, రమేష్ బత్తిని, మధు, స్వామి నాయక్, నాగరాజు గౌడ్, గాయత్రీ ప్రసాద్, రాజు నాయక్, లక్పతి నాయక్, దేవ్‌సింగ్ నాయక్, అజయ్ కుమార్,సత్యనారాయణ, శివ, జీవన్ నాయక్, నాగరాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ బీఆర్ఎస్ కార్యాలయంలోఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన మంద సంజీవరెడ్డి

బోడుప్పల్,ఆగస్ట్15(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ,నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి,మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. అనంతరం



పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాకు వందనం చేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్లో స్వాతంత్ర్య వేడుకలు

హైదరాబాద్, ఆగస్ట్ 15 (విజన్ ఆంధ్ర) : 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం హైదరాబాద్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ ఐక్యత, అభివృద్ధికి విద్యార్థులు పాటుపడాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల




సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అధ్యాపకులు మమ్మద్ సల్మాన్, మహమ్మద్ సిద్ధిక్, మమ్మద్ షఫీ ఉల్లా ఇమాన్, మహమ్మద్ సమీర్ ఆలం, మిస్సెస్ ఇమ్రానా ఫాతిమా, సమీరా ఫాతిమా, టీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ జి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

# కేర్, ఆస్టర్ ఆసుపత్రుల్లో స్వాతంత్ర్య వేడుకలు



హైదరాబాద్, ఆగష్టు 15 (విజన్ ఆంధ్ర): కేర్, ఆస్టర్ హాస్పిటల్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్స్ ఔట్ పేషెంట్ సెంటర్ క్వాలిటీ కేర్ లిమిటెడ్ సీఈఓ-ఇండియా-2 డాక్టర్ పవన్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని కాపాడుతుంటే, ఆసుపత్రుల్లో వైద్యులు ప్రజల ఆరోగ్యం, ప్రాణాలను కాపాడుతున్నారని చెప్పారు. వికసిత్ భారత్ - 2047 లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ కలిసి సాధించాలని పిలుపునిచ్చారు. జోనల్ హెడ్ బీకేఆర్ జోష్, ప్రెసిడెంట్ మెడికల్ డైరెక్టర్ విజిత్ సింగ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.కె.గురీశ్, డాక్టర్ వి.సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవేందర్ నగర్ కాలనీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు



బోడుప్పల్ ,ఆగస్ట్15(విజన్ ఆంధ్ర): బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో కాలనీ కమిటీ అధ్యక్షుడు మైల నర్సింహ్మ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు తలారి రవి యాదవ్, మాజీ కార్పొరేటర్ సామల పవన్ రెడ్డి,జిల్లా బీజేపి ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్,మేడిపల్లి మండల సీపీఐ కార్యదర్శి రచ్చ కిషన్ లుహాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.కాలనీ అభివృద్ధికి ప్రజలంతా ఐక్యంగా పనిచేయాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి బోదగళ్ల నరసింహ,కోశాధికారి మరాఠీ మత్స్యగిరి,ఉపాధ్యక్షులు దండు రమేష్,జోగు సుధాకర్,జర్నలిస్టు దూడల విష్ణుగౌడ్,బండ బీరప్ప,జోగు మల్లయ్య,మాల్ల కృష్ణ,కుక్కల స్వామి,తిరుమలేష్, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, యువత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎంచుకునే స్వేచ్ఛ కల్పించాలి

## -సీనియర్ జర్నలిస్ట్, ఎన్నికల విశ్లేషకుడు ఎం.సతీష్ చందర్



హైదరాబాద్, ఆగస్ట్ 15 (విజన్ ఆంధ్ర) : విద్యార్థులకు తమ ఆసక్తులకు అనుగుణంగా రంగాలను ఎంచుకునే స్వేచ్ఛ కల్పించాలని సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత, ఎన్నికల విశ్లేషకుడు ఎం.సతీష్ చందర్ సూచించారు. శనివారం ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు స్కూల్ డైరెక్టర్ ప్రార్థనా మణికొండ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి సతీష్ చందర్ విశిష్ట అతిథి, ప్రముఖ కవి, సోషల్ రిఫార్మర్ అవార్డు గ్రహీత ఎస్.రాజలింగంతో కలసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల వ్యవస్థాపకుడు వేదకుమార్ మణికొండ దూర దృష్టిని ప్రశంసించారు. స్కూల్ డీన్ జి.రామానుజుల, కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, సునీత ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 36వ డివిజన్ లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) 36వ డివిజన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. చింతల్ పోచమ్మ గుడి వద్ద, ఆర్ఎస్ నగర్ ఆఫీస్ వద్ద మరియు జ్యోతిబాస్ నగర్‌లో జాతీయ జెండాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మర్రి శ్రీనివాస్ మరియు జ్యోతి బసు నగర్ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు గడల రమేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో 36 వ డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, యూత్ నాయకులు దాసరి భిక్షపతి, సిరబోయిన ఎల్లయ్య, నరిగే కుమార్, బొజ్జ మురళి, నీలం నవీన్, మిట్టపిల్లి రమేష్, పోలపిల్లి రాజేందర్, పెసరి వెంకన్న, మల్యాల రామకృష్ణ, మంద జేకోబు, సిద్ధ రాంబాబు, ఎస్డీ మస్తాన్, నూనె అజయ్, బొంత కార్తిక్, ఇల్కా రాజేష్, గాడుగుల రాజ్‌కుమార్, బోల్ల రాజ్‌కుమార్, గేడం కార్తీక్, సోమ నాగరాజు, ప్రతాప్ అరవింద్, మార్త రాజు, ఎండీ కమర్, పిట్టెల చంద్రకళ, కర్నకంటి అరుణ, సోమ నాగరాజు, గడ్డం పవన్, సోమ రామకృష్ణ, ప్రతాప్ శారద,రాజారాం ప్రకాశ్, భూపాల సంపత్, సోమ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల మహత్తర పాత్ర

## లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

## సిపిఐ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) : దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల మహత్తర పాత్ర ఉందని, అందరి త్యాగాలతో సిద్ధించిన స్వాతంత్ర్య భారతంలో లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మహనీయుల త్యాగం వల్లే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, భారతదేశ స్వాతంత్ర్య పోరాటాన్ని, చరిత్రను దొంగలించేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపిలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు మహత్తర పాత్ర పోషించారని,ఆ పోరాటంలో అమరులైన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయుల చరిత్రను నేటి తరానికి అంద చేయవల్సిన బాధ్యత పాలకులపై ఉందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మత రాజ్యాంగంగా మార్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నదని, దేశాన్ని హిందూ దేశంగా మార్చే కుట్ర చేస్తున్నదని, ఈ ప్రయత్నాన్ని లౌకిక, ప్రజాస్వామిక వాదులు, కమ్యూనిస్టులు సమిష్టిగా ఎదుర్కొని రాజ్యాంగ ప్రాథమిక లక్షణమైన సెక్యులర్, ఫెడరల్, సమానత్వ, సామ్యవాద విధానాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్ఏ స్టాలిన్, మునిగాల బిక్షపతి, ఎదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, బాషబోయిన సంతోష్, మాలోత్ శంకర్ నాయక్, శనిగరపు రాజు కుమార్, గుంటి రాజేందర్, ఉట్కూరి ప్రణీత్ గౌడ్, అలువాల రాజు, పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కోడెపాక బాబు, మామునూరి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# సంఖ్యను పెంచుదాం పాఠశాలను కొనసాగిద్దాం

## సర్కారు బడిలో చేరితే రూ.1000 నగదు పారితోషికం

## బురాన్ పల్లి గ్రామ సర్కార్ బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యం

## మా అమ్మానాన్నల జ్ఞాపకార్థం చేరిన ప్రతి విద్యార్థికి అందజేత

## బురాన్ పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పటేల్ మనోహర్గౌడ



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) : మాట ఇస్తే తప్పకూడదు. తప్పేటట్లు అయితే మాట ఇవ్వకూడదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని కష్టనష్టాలు వచ్చినా వెనుకంజ వేయడు. గ్రామంలో సర్కారు బడి పునరుజ్జీవనం కొనసాగడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు. సర్కారు బడిలో విద్యార్థుల సంఖ్య పెరిగితే గ్రామంలోనే సర్కార్ బడి కొనసాగుతుందనే బలమైన విశ్వాసం కలిగిన వ్యక్తి. గత సంవత్సరం జనవరిలో ఇచ్చిన మాటకు కట్టుబడి 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సర్కారు బడిలో చేరిన విద్యార్థులకు వెయ్యి రూపాయల చొప్పున నగదు పారితోషికం అందజేసిన సహృదయుడు మానవతావాది ముందుచూపు కల వ్యక్తి. తన తల్లిదండ్రులు పటేల్ వీరమ్మ, పోలీస్ పటేల్ వెంకటాచలం గౌడ్ పుణ్య దంపతుల జ్ఞాపకార్థం సర్కార్ బడిలో చేరిన ప్రతి విద్యార్థికి వెయ్యి రూపాయల చొప్పున నగదు పారితోషికం అందజేశారు. ఆ పుణ్య దంపతుల 8వ సంతానం పటేల్ మనోహర్ గౌడ్ లక్ష్యం నెరవేరాలని పలువురు శుభాశీస్సులు అందజేస్తూ ఆకాంక్షించారు. సర్కార్ బడిని గ్రామంలోనే కొనసాగించాలనే అతని ఉన్నతాశయం నెరవేరాలని బలంగా మనమందరం ఆశిద్దాం. గ్రామ పెద్దలు ప్రజలు యువకులు పార్టీలకు అతీతంగా వ్యవహరించి గ్రామంలోనే సర్కార్బడిని కొనసాగించేందుకు ప్రతిన బూనాలని మనసారా కోరుకున్నాడు. ఒక మహోన్నతమైన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు సహాయ సహకారం అందించాలని కోరుకుందాం. ఊరికి ఉపకారం చేసే వ్యక్తిని మనసారా ఆశీర్వదించి ప్రోత్సహించే గుణం ప్రతి ఒక్కరిలో కలగాలి.

# కొత్తగూడెం ఏరియాలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## దేశభక్తితో పాటు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడమే నిజమైన దేశసేవ

## భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలి: ఏరియా జీఎం సీహెచ్. వెంకటరమణ



కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 16(విజన్ ఆంధ్ర)80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి కొత్తగూడెం ఏరియాలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా జీఎం సీహెచ్. వెంకటరమణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్స్‌లో ఉదయం 10 గంటలకు ప్రధాన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం సీహెచ్. వెంకటరమణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎస్అండ్‌పీసీ సిబ్బంది, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన కవాతును ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా జీఎం సీహెచ్. వెంకటరమణ మాట్లాడుతూ.. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి సాధించిన స్వాతంత్ర్యాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారు కలలుగన్న బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం అంటే కేవలం హక్కులను అనుభవించడం మాత్రమే కాదని, దేశం పట్ల బాధ్యతతో వ్యవహరించడమే నిజమైన దేశభక్తి అని జీఎం పేర్కొన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి, తద్వారా దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సింగరేణి సంస్థ దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తోందని వక్తలు పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల కష్టపడి పనిచేసే తత్వం, అంకితభావమే సంస్థ పురోగతికి ప్రధాన బలమని అన్నారు. సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఉద్యోగులు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతను పెంపొందించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తమ ఉద్యోగులకు సన్మానంఅనంతరం కొత్తగూడెం ఏరియాలోని వివిధ గనుల్లో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఉద్యోగులను వారి కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన ఎస్అండ్‌పీసీ సిబ్బందికి కమండేషన్ సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. అనంతరం వేడుకల నిర్వహణలో భాగస్వాములైన సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది, ఎస్అండ్‌పీసీ సిబ్బంది, విద్యార్థులకు మెమెంటోలు అందజేసి కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో జీఎం సీహెచ్. వెంకటరమణ, ఎస్‌వో టు జీఎం గోవిందరావు, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ అభిలాష్, డీజీఎం ఈఅండ్ఎం క్రిస్టోఫర్, డీవైపీఎం హరీష్, సీనియర్ పీఓ మురళి, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ సీహెచ్. సాగర్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ కే. సౌజన్య, ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ జెండాను ఎగరవేసి జిల్లా ఎస్పీ టి . శ్రీనివాస రావు




గద్వాల ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర బ్యూరో)80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజు ఉదయం 07:40 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ టి . శ్రీనివాస రావు జాతీయ జెండాను ఎగరవేసి, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందికి, కుటుంబ సభ్యులకు,జిల్లా ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. మాతృ భూమి కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసి బ్రిటిష్ వారితో పోరాడి, మనకు సమకూర్చి పెట్టిన ఈ స్వాతంత్ర్య భారత్ నేటితో 79 వసంతాలను పూర్తి చేసుకుందని, ఈ సందర్భంగా ఆ మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు.స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పండుగలు మనం సమాజానికి ఏవిధంగా సేవాచేయాలని మన విధులను గుర్తు చేస్తాయని అన్నారు.పోలీస్ అధికారులు,సిబ్బంది పూర్తి బాధ్యతతో పని చెయ్యాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఒక్కరిని సమానంగా చూడటం, ప్రతి బాధితుడికి న్యాయం చేయగలిగినప్పుడే మనం సాధించుకున్న స్వాతంత్ర్య దేశానికి సార్థకత అని అన్నారు. భిన్న భాషలు, భిన్న జాతులు, భిన్న మతాల కలయిక మన భారత దేశం అని, ఇన్ని విభిన్న సంస్కృతి, సాంప్రదాయలున్న వ్యక్తులు లేదా సమూహాల మధ్య సామరస్యం , ఐక్యత భిన్నత్వంలో ఏకత్వాన్ని సూచిస్తుందని, భారతీయులుగా పుట్టినందుకు మనందరం గర్వపడాలన్నారు. ముఖ్యం గా పోలీస్ డిపార్ట్మెంట్ శాంతి భద్రతలను కాపాడాలని, కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా శాంతి భద్రతలను కాపాడుతేనే రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు.ప్రతి ఒక్కరు తన పని నీ మెరుగుపరుచుకుంటూ ముందుకెళ్లాలని, ప్రజలు,ప్రభుత్వం పోలీస్ శాఖ నుండి ఆశిస్తున్న అంచనాలను అందుకోవాలని,మన విధులను అంకితభావంతో నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.అదనపు ఎస్పీ మాట్లాడుతూ 80వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ శాఖ, ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగితే మరింత సురక్షితమైన శాంతియుతమైన, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలుగుతామని తెలిపారు.తరవాత తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్-2 న రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన సేవ పతకాలలో జిల్లా నుండి సేవ పతకాలకు ఎంపిక అయిన అధికారులకు జిల్లా ఎస్పీ పతకాలు అందజేశారు.సేవ పతకాలు అందుకున్న అధికారులు.యూ.యూ. శ్రీనివాసులు, ఏఎస్ఐ - ఉత్తమ సేవా పతకం,సీహెచ్. నాగేశ్వర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ (ఎఫ్), డీఎస్బీ, గద్వాల - సేవా పతకం,వి. శ్రీనివాసులు గౌడ్, ఏఎస్ఐ, కోదండపూర్ - సేవా పతకం,ఎం.డి. జమీరుద్దీన్, ఏఎస్ఐ, మానవపాడు - సేవా పతకం,కె. వెంకటరామిరెడ్డి, ఏఎస్ఐ, ఇటిక్యాల పోలీస్ స్టేషన్ - సేవా పతకం,అలాగే జిల్లాలో 43 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ శంకర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు.ఎస్పీ కె. శంకర్, డి.ఎస్పి, మొగిలయ్య , సాయుధ దళ డి. ఎస్పీ నరేందర్ రావు,కార్యాలయ ఏ ఓ సాయి కృష్ణ, గద్వాల్ సిఐ టి. శ్రీను, ఆర్ ఐ లు వెంకటేష్ ,నరేష్, హరీఫ్,ఐటీ, డిసి ఆర్బి, ఎస్బి, విభాగాల అధికారులు, ఆయా పోలీస్ స్టేషన్ ల ఎస్సై లు సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఆహారభద్రత స్మార్ట్ రేషన్ కార్డు

## రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15,( విజన్ ఆంధ్ర)జిల్లాలో అర్హత కలిగిన ప్రతి రేషన్ కార్డుదారుడికి భద్రతతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె.హరిత, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డె అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అలీబిల్ అహ్మద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అర్హులైన రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఈ కార్డు ద్వారా సరుకులు తీసుకోవాలని తెలిపారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆహార భద్రత స్మార్ట్ కార్డు లో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 64 వేల 939 లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు అందిస్తున్న సన్నబియ్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి లబ్ధిదారుడు రేషన్ బియ్యం తీసుకోవాలని తెలిపారు. శాసనమండలి సభ్యులు దండే విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులతో ఎలాంటి అక్రమాలు జరగకుండా నివారించవచ్చని, ఈ కార్డు అనేక సంక్షేమ పథకాలకు ప్రామాణికమని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి మాట్లాడుతూ రేషన్ కార్డుదారులందరికీ స్మార్ట్ కార్డులు అందించడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రతి కార్డుదారుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందించాలని తెలిపారు అనంతరం రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, తహసిల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, రేషన్ కార్డు లబ్ధిదారులు, డీలర్లు పాల్గొన్నారు.

# దేశభక్తి మనందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం



సరూర్ నగర్ ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర): భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ మండలం ఎన్టీఆర్ నగర్ డివిజన్ పరిధిలోని వైస్సార్ చౌరస్తాలో జాతీయ జెండాను మాజీ జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

**– త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ, అభివృద్ధి సలహాదారులు వి. హనుమంతరావు**

**–ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**



కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 15 (విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగారాష్ట్ర వి. హనుమంతరావు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మీదట, పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని నివేదిస్తూ, ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక, అటవీ, విద్యా, వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం, మిషన్ భగీరథ, నీటి పారుదల, సమగ్ర శిక్ష అభియాన్ తదితర శాఖల ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్స్ ను సందర్శించారు. . ఉత్తమ సేవలు అందించిన 254 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. పతకాలు పొందిన పోలీసులకు మెడల్స్ బహూకరించారు. స్వాతంత్ర్య సమర యోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సన్మానించారు. పంద్రాగస్టు వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే రీతిలో సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించి ఆహూతుల మన్ననలు అందుకున్నారు. పాఠశాలల చిన్నారులు సాంస్కృతిక గేయాలపై చక్కటి అభినయం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి వి. హనుమంతరావు ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ మదన్ మోహన్ రావు, జిల్లా గ్రంథాలయ శాఖ మద్ది చంద్రకాంత్ రెడ్డి. మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్పు ఉమారాణి. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్. అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి,డి ఆర్ వో పాండు. ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల పంపిణీతో పేద కుటుంబాలకు భరోసా

**గత పదేళ్లలో జరగని సంక్షేమం..**
**కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబానికి అండ: ఎమ్మెల్యే నాయిని..**




హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర)హనుమకొండ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ,జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి .ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి కడియం కావ్య, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు లతో కలిసి పాల్గొన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో పేదలకు కొత్త రేషన్ కార్డులు, ఇళ్లు, సంక్షేమ పథకాలు అందిన పరిస్థితి ఏమిటో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని అన్నారు.రేషన్ కార్డులు లేక అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు అందించడం సంతోషకరమైన విషయమని నాయిని అన్నారు. కొత్త రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేయడం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువవుతాయని చెప్పారు.పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉచిత విద్యుత్ సహా అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో తొలి విడతగా 3,500 ఇళ్లు, రెండో విడతగా మరో 2,000 ఇళ్లను మంజూరు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటోందని, పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.రేషన్ కార్డుపై ముఖ్యమంత్రి ఫొటోపై కొందరు రాజకీయ విమర్శలు చేయడాన్ని నాయిని తప్పుబట్టారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వాన్ని గుర్తు చేసుకోవడంలో తప్పేమీ లేదన్నారు. గత పదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలు ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే అనేక హామీలను అమలు చేసిందని పేర్కొన్నారు.హనుమకొండ జిల్లా అభివృద్ధిలో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంతో జిల్లా వేగంగా ముందుకు సాగుతోందని నాయిని తెలిపారు. రాబోయే కాలంలో మిగిలిన హామీలు, సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ , అదనపు కలెక్టర్ రవి, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండాను ఎగురవేసిన జిల్లా కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర బ్యూరో) :భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం జాతీయ జెండాను ఎగురవేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం, జడ్పీ కార్యాలయ ఆవరణలోనూ జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం పలువురు విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందజేశారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, ఏవో రాంరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సామాజిక సేవా పురస్కారం అందుకున్న ఇ.వి. శ్రీనివాస్ రావు



హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 ( విజన్ ఆంధ్ర ) : సామాజిక సేవా రంగంలో అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఇ.వి. శ్రీనివాస్ రావుకు “బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు” లభించింది.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, సమాజ సేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.పార్లమెంట్ సభ్యురాలు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో ఈ పురస్కారం అందుకోవడం తనకు ఎంతో గౌరవంగా, ఆనందంగా ఉందన్నారు.తన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించిన జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నిర్వాహకులకు ఇ.వి. శ్రీనివాస్ రావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రెస్ క్లబ్ లో కన్నుల పండుగగా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు

**జాతీయజెండా ఆవిష్కరించిన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు**
**హజరైన కమిటీ బాధ్యులు, వివిధ యూనియన్ల నేతలు, సీనియర్ జర్నలిస్టులు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర)జెండా వందనం అనంతరం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులకు త్వరలోనే ఇంటిస్థలాలు అందించేందుకు తగిన ప్రణాళిక రూపుదిద్దుకుందని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు ప్రకటించారు. 10 రోజుల్లో ఇందుకు సంబంధించిన విధివిధానాలను టి యు డబ్ల్యూ జే – ఐజేయు నేతలు ప్రకటిస్తారని చెప్పారు. నిబంధనలు నచ్చిన వారు మాత్రమే అప్లై చేసుకోవాలని, వాటిని హౌజింగ్ కమిటీ స్క్రీనింగ్ చేస్తుందని, ఆ తర్వాత మాత్రమే సభ్యులుగా చేర్చుకోవటం జరుగుతుందని తేల్చిచెప్పారు. టి యు డబ్ల్యూ జే – ఐజేయు సభ్యులకు ప్రాధాన్యం ఇస్తామని, టి డబ్ల్యూ జేఎఫ్ తమకు మిత్రపక్షమని వారికి,తటస్థులకు ప్రాధన్యతఇచ్చి కలుపుకుపోతామని చెప్పారు. ప్రెస్ క్లబ్ లో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రభుత్వం నుండి వచ్చిన నిధులతోనే జరుగుతున్నాయని, సభ్యుల ఇన్సూరెన్స్ ల కోసం కమిటీ ఏకగ్రీవ నిర్ణయంతో క్లబ్ నిధులు వెచ్చించామని తెలిపారు. కొందరు తమపై బురదజల్లటమే పనిగా పెట్టుకుని తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని, కేసులు పెడుతున్నారని , వారి నీచరాజకీయాలకు భయపడేది లేదన్నారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షుడు కొడిపెల్లి దుర్గాప్రసాదరావు, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ పొడిచెట్టి విష్ణువర్ధన్, వలిశెట్టి సుధాకర్, ఈసీ సభ్యులు ఎండీ నయీంపాషా, సంజీవయ్య, బలవారి విజయ్, టి యు డబ్ల్యూ జే –ఐజేయు హన్మకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, కార్యదర్శి ఉటకూరి సాయిరాం, రాష్ట్ర నాయకులు గాడిపెల్లి మధు, పీవీ మదన్ మోహన్, కంకణాల సంతోష్, పిన్నా శివకుమార్, టీ డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, జర్నలిస్టులు విజయభాస్కర్,అంతడుపుల శ్రీనివాస్, అడుప సాంబశివరావు, జన్ను స్వామి, బూరం ప్రశాంత్, వేణు, శోభన్ బాబు, ధనుంజయ, నాగరాజు,రమేశ్, తదితరులు పాల్గొన్నారు

# కామారెడ్డి జిల్లా సంక్షేమ పథకాలలో గణనీయమైన పురోగతి

**– 80 వ పంద్రాగస్టు దినోత్సవ వేడుకల్లో బీసీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు వి. హన్మంత్ రావు**

కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 15(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని బీసీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు వి. హన్మంత్ రావు అన్నారు. రైతు సంక్షేమం నుంచి విద్య, వైద్యం వరకు ప్రతి వర్గానికి ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయని పేర్కొన్నారు.కామారెడ్డి ఇందిరాగాంధీ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. హన్మంత్ రావుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర స్వాగతం పలికారు. జెండావిష్కరణ చేసిన అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.– వరి ధాన్యం కొనుగోలు:– గత యాసంగిలో రైతుల పండించిన 46వేల 388 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల ద్వారా కొనుగోలు చేసి ఒక్క వెయ్యి 114 కోట్ల 20 లక్షల రూపాయలను రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు.రైతు భరోసా:–ప్రస్తుత వాన కాలంలో మూడు లక్షల 6,890 రైతుల ఖాతాలలో 305 కోట్ల 72 లక్షల రూపాయల ను జమ చేయడం జరిగిందన్నారు– రైతు బీమా:–గత ఆర్థిక సంవత్సరంలో మరణించిన ఒక వెయ్యి 50 మంది రైతుల నామినీల యొక్క బ్యాంకు ఖాతాలలో 52 కోట్ల 50 లక్షల రూపాయలను జమ చేశామన్నారు. –విత్తనాల పంపిణీ:–ప్రస్తుతం సీజన్లో 2500 ఎకరాకు సరిపడు సోయాబీన్, 30 వేల ఐదువందల ఎకరాలు సరిపడు కంది, పెసర మినీ కిడ్స్ 100% సబ్సిడీతో ఒక కోటి పాదారుల లక్షల రూపాయల విలువ గల విత్తనాలను పంపించేశామన్నారు. 4 వేయిల 224 క్వింటాళ్ల



పచ్చిరొట్ట విత్తనాలు మూడు కోట్ల 42 లక్షల వ్యయంతో 50 శాతం సబ్సిడీ పై రైతులకు అందించామన్నారు – మార్కెట్ పెడ్ ఆధ్వర్యంలో 41, వెయిల 822 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ధాన్యాన్ని, 63805 మెట్రిక్ టన్నుల జొన్న ధాన్యాన్ని ఒక్క వెయ్యి 617 మెట్రిక్ టన్నుల శనగలను ప్రత్యేక కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి మద్దతు ధర కొనుగోలు చెశమన్నారు. పిఎసిఎస్ ల ద్వారా 24 ఆరాధన78 మెట్రిక్ టన్ల వివిధ రకములు ఎరువులను రైతులకు అందించామన్నారు. ఉద్యానవని శాఖ, ఆహార భద్రత, రేషన్ కార్డుల జారీ, చేయూత, పెన్షన్లు, లింకేజ్ శ్రీనిధి, ఉచిత బస్సు సౌకర్యం, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్, కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలు, మైనార్టీ సంక్షేమం, కులాంతర వివాహ జంటలకు నగదు ప్రోత్సాహం, ప్రభుత్వ పాఠశాలలో బోధన మెరుగ్గా ఉండేలా చర్యలు, బ్రో జ్యోతి, వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం, రాజీవ్ ఆరోగ్య శ్రీ, పంచాయతీరాజ్, అగ్నిమాపక దళం, పోలీస్ శాఖ నిర్వహిస్తున్న హరివ్ హాలీవు, ఆపరేషన్ కవాచ్ అని వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పోలీస్ శాఖ ప్రజలకు నమ్మకమైన రక్షణగా కవచంగా నిలిచిందన్నారు. కామారెడ్డి జిల్లాను నేర రహిత సమాజంగా మార్చడానికి పోలీస్ శాఖ తీసుకున్న చర్యలతో పాటు మనం అందరి సహాయ సహకారాలు కావాలని ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అందేలా కృషి చేస్తున్న జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. 1.18 లక్షల 827 మంది రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తుండగా ఈ ఏడాది అదనంగా 924 కొత్త కనెక్షన్లకు మంజూరు చేశామని చెప్పారు.– మహిళల కోసం..మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వీహెచ్ అన్నారు. కొత్తగా చేయూత పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 7.51 లక్షల మంది మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని, స్వయం సహాయక సంఘాలకు రూ.200 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు కల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులకు యూనిఫాంలు, నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద గత ఏడాది జిల్లాలో 18,369 మందికి రూ.50.56 కోట్లు, ఈ ఏడాది 5,691 మందికి రూ.16.51 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ “అరైవ్ అలైవ్”, “ఆపరేషన్ కవచ్” కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా 11.25 లక్షల మొక్కలు నాటినట్లు వివరించారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆయన పరిశీలించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినపలువురు అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, రవితేజ,ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్ వై గిరి అధికారులు ప్రజాప్రతినిధులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రజక సంఘం ఆధ్వర్యంలో స్వతంత్ర్య నోత్సవ వేడుకలు

**జెండా ఎగురవేసిన రజక సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తకొండ పోశం**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 15,(విజన్ ఆంధ్ర)80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మంచిర్యాల పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల రజక సంఘం భవనంలో శనివారం జాతీయ జెండాను సంగం పట్టణ ప్రధాన కార్యదర్శి కొత్తకొండ పోచం ఎగరవేశారు.ముందుగా మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కొత్తకొండ పోచం మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. స్వాతంత్రం కోసం ఎంతోమంది మహోన్నతమైన వ్యక్తులు కొట్లాడి సాధించుకున్న సందర్భంను ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమం లో కోశాధికారి పోశం, ఉపాధ్యక్షులు నల్లూరి మల్లయ్య, పోచంపల్లి ధర్మయ్య,నిమ్మరాజుల కుమార్, సలహాదారు, మీడియా ప్రతినిధి నేరెళ్ళ రమేష్, మాజీ అధ్యక్షులు మైలారం శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు పారిపెల్లి మల్లేష్, ఏదుళ్ల రాజాం, డైరెక్టర్లు జంగపెల్లి సతీష్, ఉప్పల కొమురయ్య,పున్నం సమ్మయ్య,ఒరగంటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 23 వ వార్డులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుక



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15(విజన్ ఆంధ్ర):మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి లోని 23వ వార్డులో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రజలు ప్రజాప్రతినిధులు జరుపుకున్నారు.భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు భాగంగా 23వ వార్డు కౌన్సిలర్ బద్దెపూరి ఐశ్వర్య గోపీనాథ్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు మన వార్డులో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉన్నదని ఆమె అన్నారు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా ఉండాలని ఆమె అన్నారు. జాతీయ జెండాని ఆవిష్కరించి స్వాతంత్ర సమరయోధులను స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో 23వ వార్డు ప్రజలు ప్రజాప్రతినిధులు బద్దెపూరీ వెంకటయ్య కోల సత్యం నాజర్ యాకాంబరం కృష్ణయ్య

# కిట్స్ వరంగల్ లో ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ఏ ఐ క్వాంటం మరియు భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటూ, ఆవిష్కరణలు మరియు కరుణ గుణం మేళవించిన ఒక దేశాన్ని నిర్మించండి అని విద్యార్థి సమాజానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి సలహా**

హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర)ఈ రోజు కిట్స్ వరంగల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవం–2026 ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి జాతీయ జెండా ఎగురవేసి, జాతీయ జెండాకు వందనం చేసి వేడుక ను ఉదయం 8.00 గంటలకు ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి స్వాతంత్ర్య చరిత్ర ప్రాముఖ్యతను, ప్రముఖ మరియు అంకితభావం గల స్వాతంత్ర్య సమరయోధుల గురించి సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, వి ఎల్ఎస్ఐ–డిజైన్ టెక్నాలజీ వంటి వర్ధమాన సాంకేతికతలకు సంబంధించి ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేందుకు కిట్స్‌లో ఎన్ఈపీ 2020 పాఠ్యప్రణాళికను ప్రవేశపెట్టినట్లు ఆయన హైలైట్ చేశారు. ఇవి సామర్థ్యాలు, జ్ఞానం, నైపుణ్యాలు మరియు వైఖరిని అందించడం ద్వారా విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి దారితీస్తాయి. స్వేచ్ఛ అనేది మనం వారసత్వంగా పొందే బహుమతి మాత్రమే కాదు, అది మనం ముందుకు తీసుకువెళ్లే బాధ్యత. విక్సిత్ భారత్ సందర్భంగా స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (ఎస్ ఎ సి ) నిర్వహించిన సాంస్కృతిక, సహ పాఠ్య కార్యకలాపాలు 2047 నాటికి భారతదేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలి. ఆయన భారత చరిత్ర నుండి కొన్ని ముఖ్యమైన, ప్రామాణికమైన అంశాలను ఉదహరించారు. దీనితో పాటు, ఆవిష్కరణ ఆలోచనలను పెంపొందించడం, ఇంక్యుబేషన్, మరియు పరిశ్రమకు సిద్ధంగా ఉన్న ఇంజనీర్ల



కోసం స్టార్టప్‌లను ఉత్పత్తి చేయడం వంటివి కూడా ఇందులో ఉన్నాయి. 2030 నాటికి మన విద్యార్థులను ఏఐ–రెడీ, క్వాంటం–రెడీ, ఫ్యూచర్–రెడీ మరియు నేషన్–రెడీగా తీర్చిదిద్దడమే మన లక్ష్యం అని ఆయన ముగించారు. ఇంకా, భారతదేశానికి మంచి పౌరులుగా మారడానికి నైతిక విలువలను పాటిస్తూ వ్యక్తిత్వాన్ని, వైఖరిని పెంపొందించుకోవాలి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా, ఎస్ ఎ సి ఆధ్వర్యంలోని ఎన్‌సిసి క్లబ్, ఎం డి యఫ్ క్లబ్, పి ఎంసి క్లబ్, ఎన్ఎస్ ఎస్ క్లబ్ మరియు లిటరరీ క్లబ్‌లు విద్యార్థుల మధ్య వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ రూపకల్పన, కవిత్వం, చర్చ, లలిత కళలు, గానం, శాస్త్రీయ, ఉప–శాస్త్రీయ, గర్బా మరియు పంజాబీ వంటి నృత్యాల పోటీలను నిర్వహిస్తున్నాయి. విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. దేశ నిర్మాణం పట్ల గర్వం, అభిరుచి మరియు దేశభక్తిని ప్రదర్శించేలా ఈ కార్యక్రమం మనందరినీ దేశభక్తి స్ఫూర్తిలో ముంచెత్తింది. ఈ రోజు చిరస్మరణీయమైనది, ఎన్‌సిసి క్యాడెట్‌ల కవాతు మరియు దేశభక్తి పాటలు, నృత్యాలు మరియు పద్యాలతో వేడుక ముగిసింది.ఈ కార్యక్రమంలో 120 ఎన్‌సిసి క్యాడెట్లు(విద్యార్థిని విద్యార్థులు), రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ప్రొఫెసర్. పి. రమేష్ రెడ్డి, ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎం. రణధీర్ కుమార్, హెడ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డా.యం. శ్రీనివాస రెడ్డి, డీన్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ ఎస్. నరసింహ రెడ్డి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ కె. శ్రీధర్, విభాగాదీపతులు, వివిధ విభాగాల డీన్స్, అలాగే ప్రొఫెసర్ ఎల్. సుధీర్ రెడ్డి, ప్రొఫెసర్ సి. వెంకటేష్ (సిఒఇ), ప్రొఫెసర్ పి. నిరంజన్ రెడ్డి (హెడ్, సిఎస్ఇ), జి. రఘోతం రెడ్డి (హెడ్, ఇ సిఇ), హెడ్ ఐ 2 ఆర్ ఇ, ప్రొఫెసర్ కె. రాజనరేందర్ రెడ్డి, ప్రొ. యు ఎస్ బాల్‌రాజ్, అసోసియేట్ ప్రొఫెసర్ & పిఆర్ఓ, డా. డి.ప్రభాకరా చారి, టీచింగ్ & టీచింగ్ యేతర సిబ్బంది మరియు విద్యార్థి ప్రతినిధులు మరియు కిట్స్ వరంగల్ విద్యార్థులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
హ్యాపీ ఇండిపెండెన్స్ డే–2026

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 15(విజన్‌ఆంధ్ర)కామారెడ్డి జిల్లాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా మువెన్నెల జెండాను ఎగుర వేశారు. శనివారం కామారెడ్డి జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో అధ్యక్షులు పున్న రాజేశ్వర్ త్రివర్ణ పథకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దేశం కొరకు పాటుపడాలని, సమయానుకూలంగా మంచి ఆహారం తీసుకొని ఆరోగ్యంగా, క్షేమంగా ఉండాలని కోరారు.స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆటల పాటల పోటీలలో గెలుపొందిన వారికి అధ్యక్షులు పున్న రాజేశ్వర్ ప్రధాన కార్యదర్శి ఎం రాజన్న బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో సేవలు చేసిన 80 సంవత్సరములు పైబడిన సీనియర్ సిటిజన్ కు బహుమతుల దాతలకు పి జీవన్, యోగ అంజయ్య లను సన్మానించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎం రాజన్న, ఉపాధ్యక్షులు డాక్టర్ పివి నరసింహం, సత్యనారాయణ, కోశాధికారి జైహింద్ గౌడ్, ఉప కార్యదర్శులు ఆంధ్ర బ్యాంక్ విశ్వనాథం, జి రాజారెడ్డి, టి రామ్ కిషన్, ఎం మోహన్ రెడ్డి, సిహెచ్ రాజేశ్వర్ రెడ్డి, పి. పురుషోత్తం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు (ఆదివారం) పరకాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక

**పరకాలలో రూ.400 కోట్లకు పైగా అభివృద్ధి పనులను ప్రారంభించనున్న సీఎం**

**సీఎం పర్యటనతో పరకాల అభివృద్ధికి కొత్త దిశ**

**రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార సంబంధాలు శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**పరకాలలో సీఎం పాల్గొనే బహిరంగ సభా వేదిక, హెలిప్యాడ్ స్థలాన్ని ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు ప్రకాష్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, కెఆర్. నాగరాజు లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి**



హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆగస్టు 16న( ఆదివారం) మధ్యాహ్నం పరకాలలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరకాల లో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పరకాల, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తో కలిసి పరకాల లోని స్థానిక అంగడి స్థలం వద్ద భారీ బహిరంగ సభ ప్రాంగణం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హెలిపాడ్ వద్ద ఏర్పాట్లను ప్రత్యక్షంగా మంత్రి శనివారం పరిశీలించారు. పరకాలలోని అంగడి స్థలం వద్ద సభా ప్రాంగణం, వేదిక, పార్కింగ్, ట్రాఫిక్, భద్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలను పరిశీలించి సమర్ధవంతంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో రూ. 400 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల చిరకాల అవసరాలను తీర్చే ఈ కార్యక్రమాలు పరకాల అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయన్నారు.ంద పడకల ఆసుపత్రి పూర్తిగతంలో శంకుస్థాపన చేసిన పరకాల వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రస్తుత ప్రభుత్వం అవసరమైన నిధులు సమకూర్చి పూర్తి చేసిందన్నారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కృషి, ముఖ్యమంత్రి సహకారంతో ఆసుపత్రి అందుబాటులోకి వస్తుండటంతో పరకాల, పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం స్థానికంగానే లభించనుందని పేర్కొన్నారు. పేదల సొంతింటి కలకు భరోసాఇందిరమ్మ ఇళ్ల పథకంలో రెండు విడతల్లో పరకాల నియోజకవర్గానికి సుమారు 6,000 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మొదటి విడతలో 3,500, రెండో విడతలో 2,500 ఇళ్లు మంజూరు కాగా, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సుమారు రూ.300 కోట్ల ఆర్థిక సహాయం అందనుందని చెప్పారు. అర్హులైన మరిన్ని కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి సభకు పరకాల నియోజకవర్గం నుంచి సుమారు 75 వేల నుంచి 80 వేల మంది ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో పార్కింగ్, ట్రాఫిక్, భద్రతతో పాటు అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పరకాల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ ఇ సురేష్ బాబు, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, పరకాల ఆర్డిఓ డి ఎస్ వెంకన్న, వివిధ శాఖల అధికారులు అరుణ్ కుమార్, తదితరులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలి

**– కులగణనతోనే బీసీల సమగ్ర అభివృద్ధి**

**ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు**

కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 15 (విజన్‌ఆంధ్ర)కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలిదేశంలో జనాభాలో బీసీల వాటా గణనీయంగా ఉన్నప్పటికీ, వారి జనాభాకు అనుగుణంగా రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని వి. హనుమంతరావు అన్నారు. జనాభా ఎంత ఉంటే, ఆ మేరకు అవకాశాలు ప్రాతినిధ్యం కల్పించాలన్నదే కాంగ్రెస్ పార్టీ డిమాండ్ అని స్పష్టం చేశారు. జనగణనతో పాటు సమగ్ర కులగణన నిర్వహించి, ప్రతి సామాజిక వర్గం జనాభా, సామాజిక–ఆర్థిక పరిస్థితులు, విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలపై సమగ్ర సమాచారం సేకరించాలని కోరారు. కులగణన ఆధారంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. –కేంద్రంపై హనుమంతరావు విమర్శలుకేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనగణనలో బీసీలకు సంబంధించిన సమగ్ర కుల వివరాలను ఎందుకు స్పష్టంగా పొందుపరచడం లేదని ఆయన ప్రశ్నించారు. దేశ జనాభాలో కీలక భాగమైన బీసీల సంఖ్య, వారి సామాజిక–ఆర్థిక స్థితిగతులు తెలియకుండా వారి అభివృద్ధికి సరైన విధానాలు ఎలా రూపొందిస్తారని ప్రశ్నించారు. "కులగణన లేకుండా బీసీలకు ఎంత న్యాయం జరుగుతుందో ఎలా నిర్ణయిస్తారు? బీసీల జనాభా లెక్కలు తేల్చకుండా వారికి సరైన వాటా ఎలా కల్పిస్తారు?" అని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. – రాహుల్ గాంధీ బీసీల హక్కుల కోసం పోరాడుతున్నారుకన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలను ఐక్యం చేయడంతో పాటు సామాజిక న్యాయం, ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలను దేశవ్యాప్తంగా ముందుకు తీసుకెళ్లారని హనుమంతరావు తెలిపారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరంతరం ప్రశ్నిస్తున్నారని, బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. పార్లమెంట్‌లో బీసీలకు న్యాయం చేసే విధంగా ప్రత్యేక చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. – అంబేద్కర్ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకండాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని వి. హనుమంతరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, పేదలు మరియు అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థమని పేర్కొన్నారు. – బీసీల సమస్యలను పరిష్కరించాలిబీసీలకు కేవలం ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కాకుండా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే శాశ్వత విధానాలు అమలు చేయాలని హనుమంతరావు డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం, ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం, స్వయం ఉపాధికి తక్కువ వడ్డీ రుణాలు, చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహకారం, వృత్తిదారులకు ఆధునిక పరికరాలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. బీసీ యువతకు నైపుణ్య శిక్షణ, పోటీ పరీక్షల కోసం ప్రత్యేక కోచింగ్, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, వెనుకబడిన బీసీ కుటుంబాలకు గృహ, విద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. – బీసీలను ఓటు బ్యాంకుగా చూడొద్దుబీసీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం కాకుండా, వారి అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి అని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై హనుమంతరావు విమర్శలు చేశారు. – బీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం... విద్యా–ఉద్యోగ రంగాల్లో అవకాశాలు, ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన వనరులు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని అన్నారు. – కులగణన కోసం ఉద్యమించాలి...స్వాతంత్ర్యం కోసం దేశ ప్రజలు ఏకమై పోరాడినట్టే, సామాజిక న్యాయం కోసం కులగణన సాధించే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని హనుమంతరావు పిలుపునిచ్చారు. కులగణన ద్వారా ప్రతి సామాజిక వర్గం వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయని, ఆ గణాంకాల ఆధారంగా విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో సముచిత నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. "కులగణనతోనే బీసీల వాస్తవ జనాభా తెలుస్తుంది. జనాభా ప్రాతిపదికన వాటా దక్కితేనే బీసీలకు సంపూర్ణ న్యాయం జరుగుతుంది. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుంది" అని వి. హనుమంతరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఐరేని సందీప్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి , మున్సిపల్ చైర్ పర్సన్ ఉమా శ్రీనివాస్ , తీగల తిరుమల గౌడ్ పండ్ల రాజు, గోనె శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్ , భూమని బాలరాజ్, సాయిలు, చాట్ల రాజేశ్వర్, కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 15,(విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రంలో ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పొట్ట మధుకర్ ఆధ్వర్యంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 57 వ డివిజన్ కార్పొరేటర్ గాజుల ముఖేష్ గౌడ్ హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాల సంబరాలు జరుపుకుంటున్న కానీ ఆటో కార్మికుల బ్రతుకులు మాత్రం అట్టడుగునే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులు ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని వీరి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రాయితీ స్కీములు తీసుకువచ్చి ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కల్వల అంజయ్య,ఎండి. షఫీ,తగరం శ్రీనివాస్, రాజేశం,వెంకటేష్, ప్రభాకర్, హైమద్, శ్రీనివాస్, శేఖర్, సాబీర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ



ఆదిలాబాద్, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ (స్మార్ట్ రేషన్) కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా కేవలం తెలంగాణలోనే తెల్ల రేషన్ కార్డులను ప్రభుత్వం అందిస్తోందని, ఈ ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆరు గ్యారంటీల అమలుతో ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో మొత్తం 2.26 లక్షల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దశలవారీగా చేపట్టామని, తొలి విడతలో అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆదిలాబాద్ జిల్లా రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని, ఎయిర్‌పోర్టు, రక్షణ అకాడమీలు, సైనిక పాఠశాలల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి జిల్లా సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సభ్యుడు గోడం నగేశ్ మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం కూడా అర్హులైన పేదలను సంక్షేమ పథకాల నుంచి తొలగించే ఉద్దేశంతో పనిచేయదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్థికంగా స్థిరపడిన వారు స్వచ్ఛందంగా రేషన్ కార్డులను వదులుకుంటే నిజమైన పేదలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని సూచించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేదల సంక్షేమం కోసం భారీగా సబ్సిడీ బియ్యం అందిస్తోందని పేర్కొంటూ, రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో భాగంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 35 వేలకుపైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో సుమారు 70 వేల మందికి లబ్ధి చేకూరిందని తెలిపారు. లబ్ధిదారులకు నాణ్యమైన సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, కార్డుదారులు 'తెలంగాణ రేషన్' మొబైల్ యాప్ ద్వారా తమ వివరాలను తెలుసుకోవచ్చని చెప్పారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1983కు ముందే కిలో బియ్యాన్ని రూ.2కు అందించిన స్వర్గీయ నందమూరి తారక రామారావును ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ పథకానికి వేల కోట్ల రూపాయలు కేటాయిస్తోందని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులను వెంటనే భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించాలని, మారుమూల ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. రేషన్ కార్డు ప్రతి పేద కుటుంబానికి అత్యంత అవసరమైన పత్రంగా అభివర్ణించారు. ఇది నిరంతర ప్రక్రియ కాబట్టి రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను అందరూ సమర్థించాలని అన్నారు. మారుమూల గ్రామాల్లో రేషన్ దుకాణాల దూరాన్ని తగ్గించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించడం బాధాకరమని, అర్హత లేనివారు స్వచ్ఛందంగా కార్డులను వదులుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. ప్రతి పేదవాడు మూడు పూటలా తిండి తినాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి దుర్వినియోగానికి తావివ్వకుండా బాధ్యతగా వినియోగించాలని కోరారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ ఎస్ చిత్రు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డిఎస్ఓ నందిని, డిఎం సుధారాణి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ లో కన్నుల పండుగగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు


**పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్**



ఆదిలాబాద్, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర): పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వేడుకలకు వచ్చిన ప్రభుత్వ సలహాదారుకు జిల్లా అధికారులు పూల మొక్క అందించి ఘన స్వాగతం పలికారు. జాతీయ గీతం, రాష్ట్ర గీతాలాపన అనంతరం కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల ఆదిలాబాద్ జిల్లా పలు రంగాల్లో ముందంజలో నిలుస్తోందని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మరింత అంకితభావంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రభుత్వ సలహాదారు, జిల్లా కలెక్టర్, ఎస్పీలు కలిసి విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయని, ప్రజాసేవలో ఇదే నిబద్ధత కొనసాగించాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రశంసాపత్రాలతో సత్కరించి అభినందించారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు, అభివృద్ధి ప్రదర్శన స్టాళ్లను సందర్శించి పరిశీలించారు. పోలీస్ శాఖ నిర్వహించిన ఆకర్షణీయ పరేడ్ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, పాయల్ శంకర్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, ఏఎస్పీలు మౌనిక, రుత్విక్ సాయి కోటే, డిఎఫ్వో చిన్న విశ్వనాథ్ భూసా రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# దేశ ప్రజలందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాయబండి పాండురంగాచారి**



ఎల్బీనగర్, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర): స్వాతంత్రం అంటే సమానత్వం స్వేచ్ఛ సమ సమాజం. దేశంలో అసమానతలు నిర్మూలించినప్పుడే నిజమైన స్వాతంత్రం సిద్ధించినట్లని ఆలిండియా వర్కర్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాయబండి పాండురంగం పిలుపు ఇచ్చారు. శనివారం గ్రేటర్ హైదరాబాద్ కొత్తపేట చౌరస్తాలో 80 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, ఝాన్సీ లక్ష్మీబాయి, అబ్దుల్ కలాం, ఆజాద్ లాంటి ఏఆశయాల కొరకు త్యాగాలు చేశారని, వారి యొక్క స్ఫూర్తిదాయక ఆశయాలు మాత్రం సంవత్సరాలు గడిచినప్పటికీ కూడా ఇంకా నెరవేరలేదన్నారు. అదేవిధంగా కొత్తపేట చౌరస్తాలో ఆటో కార్మికులు జాతీయ జెండా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయజెండా ఎగురవేశారు. ఈ జెండా వందన కార్యక్రమంలో ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ రాష్ట్ర నాయకులు వేమన శ్యాం ప్రసాద్, కొప్పు యాదయ్య, కొయ్యడ వెంకటస్వామి, నాగార్జునపు రాజ్యలక్ష్మి, మోత్కూరి మల్లాచారి, శివగల్ల శ్రీనివాస్, నల్ల జగన్, హరిబాబు, శ్రీకాంత్ చారి, ఎస్వి రాములు, వాణి, బిఎల్ఎఫ్ నాయకులు మారోజు సునీల్ కుమార్, శ్రీశైలం, స్థానిక నాయకులు రఘుమారెడ్డి, మాణిక్యంరెడ్డి, శివ, వెంకటాచారి, ఆటో కార్మికులు, పెయింటర్ కార్మికులు కార్పెంటర్ కార్మికులు తాపీ మేస్త్రి కార్మికులు ఎలక్ట్రిషన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# శివగంగ కాలనీలో పంద్రాగస్టు వేడుకలు

ఎల్బీనగర్, ఆగస్టు 15(విజన్ ఆంధ్ర): ఎల్ బీ నగర్ నియోజకవర్గం హయత్ నగర్ మండల కేంద్రంలోని శివగంగ నగర్ కాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఘనంగా జండా పండగను నిర్వహించారు. జండా ఆవిష్కరణ సమావేశంలో కాలనీ అధ్యక్షా కార్యదర్శులు స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకొని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షా, కార్యదర్శులు బద్దం చంద్రరెడ్డి, సకిలంమెట్ల అశోక్, గౌరవ అధ్యక్షులు కొలను బాల్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు భీంపాక్ రామకృష్ణ, కొలను సింధురెడ్డి, జి శ్యాంసుందర్ రెడ్డి, మునుగోటి బాలకృష్ణ, బద్దం శివసాగర్ రెడ్డి, మునుగోటి యాదయ్య, కాలనీ సంఘం గౌరవ నాయకులు సభ్యులు తదీతరులు విశేషంగా పాల్గొన్నారు.

# సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ లో పంద్రాగస్టు వేడుకలు

**ది అఖిలభారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం**

ఎల్బీనగర్, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర):దిఅఖిలభారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బి.యన్.రెడ్డి డివిజన్ లో గల సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ కమాన్ సమీపంలో ఆగస్టు 15 పంద్రాగస్టు వేడుకల్లో సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ది అఖిలభారత విశ్వకర్మ మహాసభ మహిళా అధికార ప్రతినిధి కస్తోజు శ్రావణి, యూత్ అధ్యక్షులు కే అభిషేక్, కే లోకనాథం, కాలనీ సభ్యులు మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కొత్మీర్ గ్రామ పంచాయతీలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




దహేగం, ఆగస్టు 15(విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగం మండలంలోని కొత్మీర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, దేశభక్తి నినాదాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నాయికిని సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాలాపన అనంతరం గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో కలిసి మువ్వన్నెల జాతీయ జెండాకు ఘనంగా వందనం సమర్పించారు. అనంతరం మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను నేటి తరానికి ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ప్రసంగించారు. సర్పంచ్ నాయికిని సత్యనారాయణ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను ఎప్పటికీ మరువరాదన్నారు. గ్రామాభివృద్ధితో పాటు దేశాభివృద్ధికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరించారు. పరిశుభ్రమైన గ్రామం, పచ్చదనం, విద్య, ఆరోగ్యం, తాగునీటి సదుపాయాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. భారత స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలను వివరిస్తూ విద్యార్థులు ప్రసంగాలు చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, మహిళలు, యువత దేశ సమగ్రత, ఐక్యత, సామరస్యాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## జెసిహెచ్ఎస్ఎల్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ జర్నలిస్ట్, జూబ్లిహిల్స్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బ్రహ్మాండభేరి గోపరాజు




హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర): ది జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ (జెసిహెచ్ఎస్ఎల్) జూబ్లిహిల్స్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండాకు వందనం చేశారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రముఖ జర్నలిస్ట్, జూబ్లిహిల్స్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బ్రహ్మాండభేరి గోపరాజు మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారు సాధించిన స్వేచ్ఛా ఫలాలను నేడు మనం అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. జర్నలిస్టుల సొంతింటి కల త్వరలోనే సాకారంజర్నలిస్టుల సొంతింటి కల సాకారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదని గోపరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని కార్యరూపంలోకి తీసుకువస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఫోర్త్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలనే ఆకాంక్ష నెరవేరే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మిక్కిలినేని రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు మసాదే లక్ష్మీనారాయణ, ట్రెజరర్ భీమగాని మహేశ్వర్, ఎంసీ సభ్యులు హాష్మీ, కమలకరాచార్య, సీనియర్ జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కొండా లక్ష్మణ్ రావు, గోపీనాథ్, మొహినుద్దీన్, సీతారాములు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు.. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదర్శం



కాగజ్‌నగర్, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర ): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని మందువా గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు చేస్తూ రైతులకు, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అనే భావనతో నిరుపేదలకు ప్రతిరోజూ కడుపునిండా భోజనం అందించాలనే సంకల్పంతో ఆయన ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన కేంద్రం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ ఒడిదుడుకులు ఎదురైనా నిరాటంకంగా కొనసాగుతోంది. అన్నదాన కేంద్రంలో భోజనం చేసే వారికి నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ఆహార పదార్థాల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో, మందువా గ్రామంలోని తన సొంత వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగు చేస్తున్నారు. పురుగుమందులు, రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ ఆరోగ్యకరమైన కూరగాయలను పండిస్తున్నారు. సొరకాయ, బీరకాయ, బెండకాయ, టమాటా, దోసకాయ, వంకాయతో పాటు పలు రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. పండించిన కూరగాయలను నేరుగా నిత్య అన్నదాన కేంద్రానికి తరలించి, అక్కడ తయారు చేసే భోజనంలో వినియోగిస్తున్నారు. దీంతో అన్నదాన కేంద్రానికి ఖర్చు తగ్గడంతో పాటు, భోజనం చేసే వారికి నాణ్యమైన, తాజా ఆహారం అందుతోంది. సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు ప్రశంసించారు. ఈ కూరగాయల తోటను వివిధ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు సందర్శించి సాగు విధానాన్ని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేపడుతున్న సేవా కార్యక్రమాలు, వ్యవసాయంపై ఉన్న ఆసక్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జిల్లా కో-ఆప్షన్ మాజీ సభ్యుడు సిద్ధిక్, ప్రముఖ వ్యాపారి బుక్క బాలు, పలువురు కాంట్రాక్టర్లు, రైతులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల పేరు మీదనే స్మార్ట్ రేషన్ కార్డులు



జిల్లా కలెక్టర్ మన చౌదరి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ప్రజలకు సులభతరమైన స్మార్ట్ రేషన్ కార్డ్ ఫిజికల్ గానే కాకుండా, డిజిటల్ గా కూడా ఇంట్లో ఉన్న మహిళల పేరు మీదనే అందించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. శనివారం శామీర్ పేట్ మండలంలోని అంతాయి పల్లిలోని ఎస్ ఎన్ ఆర్ వేద్ కన్వెన్షన్ హాల్ లో జిల్లా సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ మను చౌదరి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం మొదలుపెట్టి సంక్షేమ పథకాలన్నీ కూడా ప్రజలకి అందాలి, చేరువ కావాలి అన్న ఒక ఆలోచన చేసినప్పుడు ప్రతి ఒక్క గ్రామంలో, ప్రతి ఒక్క మున్సిపాలిటీలో ప్రజల దగ్గర నుంచి వారు ఏ ఏ స్కీమ్ లో లబ్ధి కోరుతున్నారనే విషయాన్ని తెలుసుకొని, అందుకనుగుణంగా వారి కోసం సంక్షేమ పథకాల రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపాలిటీ వార్డు స్థాయిలో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులందరికి లబ్ది చేకూర్చాలన్నదే ప్రభుత్వ లక్షమన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటివరకు 1,39,622 కొత్త రేషన్ కార్డుల ద్వారా 6 కిలోల చొప్పున సన్న బియ్యం తీసుకుంటున్నారన్నారు. జిల్లాలో సుమారు ప్రతి నెల 14 నుంచి 15 వేల టన్నుల సన్న బియ్యం ప్రజలకు అందిస్తున్నామన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రజలకే కాకుండా రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ లో ఒక కామన్ డైట్ మెనూ పెట్టి సన్న బియ్యంతోటే పౌష్టికారారం వండి విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డ్స్ లో ముందువైపు రేషన్ కార్డ్ నంబర్, మీ పేరు, కింద రేషన్ షాప్ నంబర్ ఉంటుందని, వెనక వైపు మీ మండలం, జిల్లా, రాష్ట్రము అడ్రస్ తో పాటు పైన ఒక క్యూఆర్ కోడ్ ఉందన్నారు. మొబైల్ లో మీరు ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మీకు వివరాలు తెలుస్తాయన్నారు. టి రేషన్, మొబైల్ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకుంటే అందులో క్యూఆర్ కోడ్ సెలెక్ట్ చేస్తే ఇంట్లో ఎంతమంది సభ్యులు ఉన్నారు, ఎంత రేషన్ తీసుకున్నారు, దేనికి తీసుకున్నారు, రేషన్ షాప్ ఎక్కడ ఉంది, డిటైల్స్ మొత్తం మీకు ఆ యాప్ లోనే కనపడతాయని తెలిపారు. మీరు ఫిజికల్ రేషన్ కార్డ్ మర్చిపోయిన మొబైల్ లో ఉన్న డిజిటల్ రేషన్ కార్డ్ లోని క్యూఆర్ కోడ్ ద్వారా రేషన్ పొందవచ్చాన్నారు. కొత్త రేషన్ కార్డ్స్ కోసం ఎప్పుడైన దరఖాస్తు చేసుకోవచ్చని ఇదొక నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్ధులు అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ ఛైర్మన్ నర్సింహులు యాదర్, గ్రంధాలయ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టిఏ కమిటి సభ్యులు జైపాల్ రెడ్డి, టిజిఎల్డిఎ ఛైర్మన్ చరణ్ కౌషిక్, ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లిల మున్సిపల్ ఛైర్మన్లు, కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



కాగజ్‌నగర్, ఆగస్టు 15(విజన్ ఆంధ్ర): దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్న సందర్భంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పూర్ మాజీ శాసనసభ్యులు శ్రీ కోనేరు కోనప్ప జాతీయ జెండాను ఆవిష్కరించి మువ్వన్నెల పతాకానికి సెల్యూట్ చేశారు. అనంతరం జాతీయ గీతాలాపన నిర్వహించి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధి దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను కొనసాగించడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలని, యువత దేశభక్తిని పెంపొందించుకుని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, వ్యాపారులు, యువకులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## నీట్ లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం




హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 ( విజన్ ఆంధ్ర)తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించే లాంగ్‌టర్మ్ నీట్ ఉచిత శిక్షణకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హన్మకొండ జిల్లా సమన్వయకర్త (డీసీవో) సుధాకృష్ణ ఒ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఫౌండేషన్ సీవోఈ చిలుకూరులో బాలురు, మహేంద్రహిల్స్ ఫౌండేషన్ సీవోఈలో బాలికలకు ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. బాలురు, బాలికలకు 100 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ బైపీసీ కోర్సులో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. "ఙఞశీవఅర.వశ్రీఖఅఞఖు.ఞఞశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఉచితంగా ఈ నెల 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



సూర్యాపేట ఆగస్టు 15:(విజన్ ఆంధ్ర)సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుంటూ దేశాభివృద్ధి, సమైక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారుస్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా గ్రంథాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మోరిశెట్టి లక్షాధి, మిలా మహదేవ్, కక్కిరేణి శ్రీదేవి, కార్యదర్శి రామచందర్ నాయక్, కాంగ్రెస్ కౌన్సిలర్స్, నాయకులు, సిబ్బంది నిర్మలా భవాని తదితరులు పాల్గొన్నారు.


దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొమ్మిడి రవీందర్, సహాయ కార్యదర్శి సింగరికొండ రవీందర్, కాంగ్రెస్ నాయకులు మోరిశెట్టి లక్షాధి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుకోవాలి

దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంపటి రమేష్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణా మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సెక్రటరీ నరసింహారావు, కోశాధికారి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. యువత దేశ భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలవాలియువత దేశ భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచి దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని ఆర్థిక శాఖ గణాంకాధికారి కార్యాలయ అకౌంట్స్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటయ్య, పద్మావతి, డీఏ రాంబాబు, భవాని, అరుణ్, శ్రీనివాస్, నగేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఫలాలను ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యంస్వాతంత్ర్య ఫలాలను ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడమే లక్ష్యమని జనసేన పార్టీ నాయకులు ఏవీ రావు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ 20వ వార్డులో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకట్, సాయి స్వరూప్, సాయి, భూక్య సైదులు, చరణ్, ఓర్సు రవి, ఓరుగంటి జగదీశ్వరి, రాపాని శ్రీనివాస్, బాలగిరి, డి. రవి తదితరులు పాల్గొన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుందాందేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇరిగేషన్ సీఈ నాగభూషణం అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, రాజ్‌కుమార్, ప్రకాష్, ఫస్సుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి, ఐక్యతతో ముందుకు సాగుదాందేశభక్తి, ఐక్యతా స్ఫూర్తితో ముందుకు సాగుతూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూర్యాపేట బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం సూర్యాపేట బులియన్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ మన్యం సింహాద్రి, కోశాధికారి బూర్ల మధు, మాజీ అధ్యక్షుడు గుణగంటి రాములు, గౌరవ అధ్యక్షుడు చికూరి సంపత్, అంతటి జానీ, అంతటి కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పతాకావిష్కరణ



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 15 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి):80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి వివేకానంద నగర్ లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అర్చకులు జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూ దేశ సమగ్రత, ఐక్యత, శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భారతదేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ దేశభక్తి సందేశాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, యోగేశ్వర శర్మ, నరేష్ శర్మ, రాజేష్ శర్మ, కేశవాచార్యులు, భక్తులు పాల్గొని "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో దేశభక్తిని చాటిచెప్పారు. ఆలయ ప్రాంగణాన్ని త్రివర్ణ పతాకాలతో అలంకరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

## 80 వ గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వ విప్

### అభివృద్ధి, సంక్షేమమే ప్రజాప్రభుత్వం లక్ష్యం
### తెలంగాణ రైజింగ్2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెడతాం
### 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి.

భూపాలపల్లి జిల్లా 15 ఆగస్టు (విజన్ ఆంధ్ర)80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా ప్రాంగణానికి చేరుకున్న విప్ కు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్య నారాయణ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. వారి పోరాటాలు, త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యతనిస్తూ, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ తెలంగాణను విశ్వవేదికపై సగర్వంగా నిలబెట్టేందుకు



కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ తెలిపారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 12 వేల చొప్పున జిల్లాలో 1,27,151 మంది రైతులకు రూ. 144.93 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లు వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు మహాలక్ష్మి పథకంవిద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించేందుకు 7 పీఎం శ్రీ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలల్లో 13,745 మొక్కలు నాటినట్లు తెలిపారు. సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన వసతులుఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 62 వసతిగృహాల్లో కామన్ డైట్ అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్, వెంటిలేటర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు వైద్య పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గిందని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, భవిష్యత్తులో కూడా ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగేవీ " 2047 ప్రభుత్వ విజన్"మనసుంటే మార్గం ఉంటుంది" అనే నినాదాన్ని ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోందని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి తెలిపారు. పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులకు, సిబ్బందికి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకుప్రశంసా పత్రాలు అందచేశారు. అనంతరం వివిద శాఖల ద్వారా లబ్ధి దారులకు అసెట్స్ పంపిణీ చేశారు. కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్ కు కఠిన సేవా పథకం ,రెవెన్యూ డివిజన్ జూనియర్ అసిస్టెంట్ రజిత కు ఉత్తమ సేవ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, డిఆర్డీఏ, సంక్షేమ, వ్యవసాయ, ఉద్యాన, వైద్య ఆరోగ్యశాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించారు. అనంతరం డా బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, ఆర్డిఓలు హరికృష్ణ, రవీందర్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు, ఉపాధ్యాయులు,పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్వతగిరి సీఐ రాజగోపాల్ కు పోలీస్ మెడల్

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు15(విజన్ ఆంధ్ర);–80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్ పోలీస్ మెడల్ ను అందుకున్నారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా సీఐ రాజగోపాల్ కు మెడల్ ను ప్రదానం చేశారు. పోలీస్ శాఖలో విధి నిర్వహణలో చూపిన సేవలు, కృషికి గుర్తింపుగా ఈ మెడల్ లభించడం పట్ల పర్వతగిరి పోలీస్ సిబ్బంది, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ ను పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు. మెడల్ అందుకోవడం పర్వతగిరి పోలీస్ శాఖకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# వంగపహాడ్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కుల పెద్దమనిషి ముస్కు వీరేశం

## ఆకట్టుకున్న అంగన్‌వాడీ చిన్నారుల దేశభక్తి ప్రదర్శనలు



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 ( విజన్ ఆంధ్ర ): గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పరిధిలోని వంగపహాడ్‌లో గడవంశీయ కులం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుల పెద్దమనిషి ముస్కు వీరేశం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశ సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని కాపాడేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ముస్కు రాజమౌళి, ముస్కు వేణు, ముస్కు రాజేంద్రప్రసాద్, కోడెం నరేష్‌బాబు, కాళిదాసు శివ, రాము, వినయ్, గోపు శంకర్, నరసింహ, రంజిత్, రవి, ప్రేమ్, కృష్ణ, శేఖర్, రాజేష్‌తో పాటు చిన్నారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివి

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 25,(విజన్ ఆంధ్ర)భారతదేశ స్వాతంత్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ లతో కలిసి హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతం, తెలంగాణ గీతాలాపనలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి సందేశాన్ని అందించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. జిల్లాలోని 892 స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన 100 కోట్ల 10 లక్షల రూపాయల బ్యాంకు లింకేజీ చెక్కును మంచిర్యాల జిల్లా సమాఖ్య సభ్యులకు అందజేశారు. పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. పథకంలో 18 మంది లబ్ధిదారులకు 46 లక్షల 72 వేల 346 రూపాయల చెక్కును అందజేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. వేడుకలకు హాజరైన అధికారులు, ప్రముఖులు, మీడియా, ప్రజల కొరకు గ్యాలరీ, త్రాగునీరు, పారిశుద్ధ్యం ఇతర కార్యక్రమాల ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు భద్రతతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 15,(విజన్ ఆంధ్ర)ప్రజలకు మరింత పారదర్శకంగా, అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు క్యూఆర్ కోడ్ భద్రతతో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి బ్రహ్మారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానేష్ లతో కలిసి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు దూసుకెళ్తుందని తెలిపారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని తెలిపారు. మంచిర్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ఈ విజయంలో జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల కృషి అభినందనీయమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ క్రమంలో మంచిర్యాల జిల్లాలో లబ్ధిదారులకు కార్డులు అందించడం



ఆనందంగా ఉందని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రజలకు ప్రాథమిక సౌకర్యాల కోసం ఇబ్బందులు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నామని, ర్యాంకింగ్‌లో 2వ స్థానంలో, విద్యార్థుల నమోదు విషయంలో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణం అని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1 కోటి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నామని, కొత్త సాంకేతికతతో రూపొందించిన ఈ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలులో స్మార్ట్ కార్డులు కీలకంగా మారనున్నాయని, రాష్ట్రంలో ప్రజాపాలన నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్యూఆర్ కోడ్‌తో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా 100 మంది లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులు ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోందని, రైతులు పండించిన సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ అందిస్తుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో నూతనంగా 40 వేల 456 రేషన్ కార్డులు జారీ చేయడం జరిగిందని, రేషన్ కార్డు ద్వారా అర్హులైన లబ్ధిదారులు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా సేవలు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజలకు ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వ పథకాలు అందించేందుకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించడం జరిగిందని తెలిపారు. సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి కొనసాగింపుగా మంచిర్యాల జిల్లాలో 100 మంది లబ్ధిదారులకు కార్డులను అందించడం జరిగిందని, మండలాల వారీగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు, మహిళలకు ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని, మంచిర్యాల నియోజకవర్గంలో పంటల ఉత్పత్తి ఊహించని విధంగా పెరిగిందని, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. పెన్షన్లకు సంబంధించి వృద్ధాప్య పెన్షన్ మినహా ఇతర కేటగిరీలకు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు జారీ చేయడమే కాకుండా ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రజలు, రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా, వేగంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. బెల్లంపల్లి శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అర్హులకు అందజేయడంలో స్మార్ట్ రేషన్ కార్డులు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మేయర్ దర్ని మధుకర్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 15,(విజన్ ఆంధ్ర)మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్,డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, మున్సిపల్ కమిషనర్ జి. అన్వేష్ తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్ మధుకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మార్గదర్శకత్వంలో మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేస్తున్నామని మధుకర్ తెలిపారు. అనంతరం గాంధీ పార్కు, ముఖరం చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజల సహకారంతో మంచిర్యాల నగరాన్ని మరింత అభివృద్ధి చెందిన, పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. అనంతరం మేయర్ ప్రజలకు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మరియు మంచిర్యాల నగర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాజ్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ వైకుంఠం, స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది

## న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్



రంగారెడ్డి బ్యూరో, ఆగష్టు15(విజన్ ఆంధ్ర):నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని స్వతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ నేటి యువత దేశభక్తి పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు మాస్టర్ అహ్మద్ ఖాన్. కానీ నేడు యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారారాని భాద్యతలు మరిచిపోయారాని అన్నారు. ఇప్పటికైనా యువత చెడు వ్యాసనాలకు బానిసలుగా కాకుండా క్రమశిక్షణ, భాద్యతలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా నేడు మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండ పోయిందని మహిళా అర్ధరాత్రి ఒంటరిగా తిరిగినప్పుడే నిజమైన స్వతంత్రం వచ్చినట్టు అని గాంధీ గారు చెప్పారు కానీ ఇప్పుడు మహిళలు రాత్రి కాదుకదా పగలు కూడా స్వేచ్ఛ గా తిరిగే పరిస్థితి లేదు. అందుకే మహిళలు, బాలికలు ఆత్మరక్షణ కొరకు కుంగ్ ఫు, కరాటే వంటి విద్యలను నేర్చుకోవాలని వాటి ద్వారా తమను తాము రక్షించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ విద్యల వల్ల శరీరం దృఢత్వం గా ఉండి ఎన్నో ఆరోగ్య సమస్యలు రాకుండ ఉంటుందని అందుకే ప్రతి ఒక్కరు కుంగ్ ఫు, కరాటే, ఇంకా వేరే విద్యలు నేర్చుకొని తమని తాము కాపాడుకుంటూ దేశానికి మరింత సేవా చేయాలనీ అన్నారు. ఈ సందర్బంగా షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలందరికి న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ తరుపున స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# స్టాళ్లను సందర్శించిన రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 15 (విజన్ ఆంధ్ర)80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మహబూబ్‌నగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు అందిస్తున్న సేవలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంత్రి సందర్శించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. వి.బి.జీ. రాంజీ, పి.ఎం.కె.ఎస్.వై, స్వచ్ఛ భారత్ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫొటో ప్రదర్శనను వీక్షించారు. అనంతరం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను పరిశీలించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి, సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ, జిల్లా వైద్యారోగ్య, విద్య, విద్యుత్, వ్యవసాయ, మత్స్య, రోడ్లు భవనాలు, ట్రాఫిక్ పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా మంత్రి సందర్శించారు. ఆయా శాఖలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులతో చర్చించారు. స్టాళ్ల ప్రదర్శనలో మెప్మాకు ప్రథమ బహుమతిస్టాళ్ల ప్రదర్శనలో మెప్మా



ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కు ఉత్తమ స్టాల్‌గా ప్రథమ బహుమతి లభించింది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కు ద్వితీయ బహుమతి, మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కు తృతీయ బహుమతి లభించింది. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులు, ఉద్యోగులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశంసా పత్రాలనుసర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,దేవరకద్ర శాసన సభ్యులు సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి, ఎస్.పి.డి.జానకి,మేయర్ మమత,ట్రైనీఅసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరిఅనితా మధుసూదన్ రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల కోటి,అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్ రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్ బి హరిప్రియ,తదితరులు పాల్గొన్నారు


## మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పంపిణీ చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 15 (విజన్ ఆంధ్ర)80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఎ) ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రుణాలకు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. జిల్లాలోని 1,219 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.143 కోట్ల రుణాల చెక్ ను మంత్రి మహిళ సంఘాల సభ్యులకు అందజేశారు. అలాగే నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ కింద 559 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.1.11 కోట్ల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. అనంతరం స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగంగా 350 మందికి టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు, 25 మంది విద్యార్థులకు సైకిళ్లు, 14 మంది లబ్ధిదారులకు స్కూటర్లు మంత్రి జూపల్లి కృష్ణారావు పంపిణీ చేశారు. మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,దేవరకద్ర శాసన సభ్యులు సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి, ఎస్.పి.డి.జానకి,మేయర్ మమత,ట్రైనీఅసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరిఅనితా మధుసూదన్ రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల కోటి,అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్ రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్ బి హరిప్రియ,తదితరులు పాల్గొన్నారు

# ప్రమాదకర బైక్ రైడింగ్‌లు చేస్తున్న ఆకతాయిలకు హెచ్చరికలు

## ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు



గద్వాల ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర బ్యూరో)స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రోడ్లపై యువకులు చేసే విన్యాసాలు, ట్రిపుల్ డ్రైవింగ్, ప్రమాదకర బైక్ రైడింగ్‌లు చేస్తున్న ఆకతాయిలకు గద్వాల పట్టణ ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు తీవ్ర హెచ్చరించి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ సిఐ కార్యాలయంలో యువకులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ట్రాఫిక్ ఎస్సై. రోడ్లపై ప్రమాదకర స్టంట్లు, రేసింగ్‌లు బైక్ రైడింగ్, వేగంగా వెళ్లే వారిపై ప్రత్యేక చర్యలు తీసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. ఇలాంటి మరి ఒకసారి చేస్తే కఠిన చర్యలతో పాటు జైలు పంపడం కూడా జరుగుతుందని ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై తెలియజేశారు.

# సీఎంఆర్ స్కూల్ మెడ్చల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం ఇన్వెస్టిచర్ వేడుకలు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): సీఎంఆర్ స్కూల్, మేడ్చల్ లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, ఉత్సాహం, గర్వభావంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. లక్ష్మీకాంతన్ ఐఏఎస్‌లి హాజరయ్యారు. సీఎంఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీమతి చ. సౌజన్య రెడ్డితో పాటు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుకలో దేశభక్తి స్ఫూర్తిని విద్యార్థి నాయకత్వంతో మేళవిస్తూ, స్వేచ్ఛ, బాధ్యత, క్రమశిక్షణ, సేవ వంటి విలువల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఇన్వెస్టిచర్ వేడుకలో నూతనంగా నియమితులైన విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. నాయకత్వం అంటే కేవలం పదవిని చేపట్టడం మాత్రమే కాదని, ఇతరులకు సేవ చేయడం, ఆదర్శంగా నిలవడం, నిజాయితీ బాధ్యతతో వ్యవహరించడం అని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, వారి త్యాగాలకు నిజమైన గౌరవం ఇవ్వాలంటే విద్యార్థులు బాధ్యతాయుతమైన, నిజాయితీగల, క్రమశిక్షణ కలిగిన, మానవతా విలువలు గల పౌరులుగా ఎదగాలని సూచించారు. ముఖ్య అతిథి , పాఠశాల యాజమాన్యం హాజరు కావడం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. విద్యార్థులు విద్యలో రాణించడంతో పాటు భవిష్యత్తులో బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. దేశభక్తి, నాయకత్వం, సేవాభావం, ప్రతిభకు కట్టుబడి ఉండాలనే నూతన సంకల్పంతో వేడుకలు ముగిశాయి.

# ముఖ్యమంత్రి పర్యటనకు ములుగు ముస్తాబు

**- రూ.16,907 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్న సీఎం రేవంత్**



ములుగు ఆగస్టు 15, విజన్ ఆంధ్ర ప్రతినిధి : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మేడారం నుంచి ములుగు వరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్ తో కలిసి మేడారం, ములుగులోని కార్యక్రమ ప్రాంతాలను పరిశీలించారు. భద్రత, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు పకడ్బందీగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి మేడారంలో సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకుని చేయూత పింఛన్ల పత్రాలను పంపిణీ చేస్తారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తారు. అనంతరం ములుగులో రూ.16,007 కోట్లతో చేపట్టనున్న పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధి పనులకు పైలాన్ ఆవిష్కరిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 7,448 కి.మీ రహదారుల అభివృద్ధికి ఇది నాంది కానుంది. అదేవిధంగా రూ.868 కోట్ల అభివృద్ధి పనుల పైలాన్ ను, రూ.63.50 కోట్లతో నిర్మించిన నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఇతర అధికారులు పాల్గొంటారు.

# ములుగులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.

**- పేదలకు సన్న బియ్యంతో పాటు సంక్షేమ ఫలాలు: మంత్రి సీతక్క.**



ములుగు ఆగస్టు 15, విజన్ ఆంధ్ర ప్రతినిధి : పేదల ఆక తీర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ములుగు తంగేడు మైదానంలో జరిగిన పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, ధనిక తేడా లేకుండా అందరికీ నాణ్యమైన సన్న బియ్యం అందించేందుకే ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రేషన్ కార్డు ద్వారా బియ్యంతో పాటు ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి ఉచిత విద్యుత్ వంటి పథకాల ప్రయోజనాలు కూడా పొందవచ్చని తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, తలసేమియా బాధితులకు పింఛన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. అర్హత ఉన్నా కార్డు లేని పేద కుటుంబాలను గుర్తించి ముందుగా కార్డులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లిసి.హెచ్. మహేందర్, జి. సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, సివిల్ సప్లై అధికారి షా ఫైజల్ హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యోత్సవంలో "మీసేవ" స్టాల్ ప్రత్యేక ఆకర్షణ

**- యూరియా బుకింగ్ నుంచి 2 నిమిషాల్లో కుల సర్టిఫికేట్ వరకు సేవలు**

ములుగు, ఆగస్టు 15, విజన్ ఆంధ్ర ప్రతినిధి : 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ములుగులో ఏర్పాటు చేసిన "మీసేవ" స్టాల్ ప్రజలను ఆకట్టుకుంది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త సేవలపై అదనపు కలెక్టర్ లిసి.హెచ్. మహేందర్ జిలి ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు పట్టాదారు పుస్తకం, ఫోన్ నెంబర్ తో రూ.10 చెల్లించి యూరియా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు 2004 నుండి పదవ తరగతి మార్కుల జాబితాను హాల్ టికెట్ తో రూ.62 ఫీజుతో వెంటనే పొందవచ్చన్నారు. ఇప్పటికే కుల ధ్రువీకరణ పత్రం ఉన్నవారు ఆధార్ తో 2 నిమిషాల్లో మళ్లీ పొందవచ్చని వివరించారు. "8096958096" వాట్సాప్ నెంబర్ ద్వారా 400 కు పైగా సేవలకు ఇంటి నుండే దరఖాస్తు చేసుకోవచ్చని, ధ్రువీకరణ పత్రాలు వేగపు తపాలా ద్వారా ఇంటికే వస్తాయని చెప్పారు. గ్రామ పాలనాధికారి, రెవెన్యూ తనిఖీదారుల కోసం ప్రత్యేక అనువర్తనం తీసుకురావడంతో సేవలు వేగంగా, పారదర్శకంగా అందుతాయన్నారు. టాస్క్ ద్వారా జిల్లా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఇప్పటివరకు 80 మందికి ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు. ఈ స్టాల్ ను జిల్లా ఈ–జిల్లా నిర్వాహకులు దేవేందర్ మీసేవ బృందం ఏర్పాటు చేసింది.

# ఏజెన్సీ కల్లు గీత సొసైటీలను పునరుద్ధరించాలి

**- కార్మికులకు వృత్తి పింఛన్లు ఇవ్వండి: రవి గౌడ్**



ములుగు, ఆగస్టు 15, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఏజెన్సీలో అనాదిగా కల్లు గీత చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవి గౌడ్, కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ములుగులో జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ 1999–2000లో జిల్లాలోని 30 కల్లు గీత సొసైటీలను రద్దు చేశారని, అప్పటి నుండి కార్మికులకు సంక్షేమ పథకాలు, వృత్తి పింఛన్లు అందడం లేదన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి సొసైటీలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆదివారం ములుగు వస్తున్న ముఖ్యమంత్రి లిరేవంత్ రెడ్డిలి ఏజెన్సీ సొసైటీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. జిల్లాలో 25 వేలకు పైగా గీత కార్మికుల ఓట్లు ఉన్నాయని, వారి సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రుద్రబోయిన మల్లేష్ గౌడ్ తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# నాగార్జున నగర్ కాలనీలో ఘనంగా 80వ. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..!



కాప్రా/ ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ పార్కులో 80వ. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు యావపురం రవి, కార్యదర్శి మొగిలి కరుణాకర్ రెడ్డి కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, నాయకులు, అధికారులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూ జీ.డీ), సీసీ రోడ్ల పునర్నిర్మాణ పనులకు అనుమతులు మంజూరై, ప్రస్తుతం ప్రారంభ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే కాలనీ పార్కుకు సంబంధించిన స్థలం ఆక్రమణకు గురైన అంశంతో పాటు, పార్కును ఆనుకుని ఉన్న రహదారి విషయమై కోర్టులో కేసు కొనసాగుతోందని తెలిపారు. కాలనీ అభివృద్ధి, పార్కు పరిరక్షణ కోసం అసోసియేషన్ తరఫున నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సీనియర్ నాయకులు సీతారామరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీశైలం, మహేష్ గౌడ్, సయ్యద్ సాదిక్, సాయి వివేక్, నాగరాజు గౌడ్, కొండల్ రెడ్డి, యాదవ్ రమేష్, రామబ్రహ్మం, లక్ష్మీకాంతయ్య, రామిణి, తిరుమలేష్, నర్సింగ్ రావు, అప్పారావు, లక్ష్మారెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

**- త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**

**- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**



నిజామాబాద్, ఆగస్టు 15 :( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మీదట, పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని నివేదిస్తూ, ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, డెయిరీ, పశు సంవర్ధక, అటవీ, విద్యా, వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం, మిషన్ భగీరథ, నీటి పారుదల, సమగ్ర శిక్ష అభియాన్ తదితర శాఖల ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్స్ ను సందర్శించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, ఆర్టీసీ, విద్యుత్, పౌర సరఫరాలు, హౌసింగ్ తదితర శాఖల శకటాల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. పతకాలు పొందిన పోలీసులకు మెడల్స్ బహూకరించారు. స్వాతంత్ర్య సమర యోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సన్మానించారు. పంద్రాగస్టు వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు అందుకున్నారు. కంజర రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, విశ్వ వికాస్ హైస్కూల్, నవీపేట్ బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు, టైం స్కూల్ చిన్నారులు సాంస్కృతిక గేయాలపై చక్కటి అభినయం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి పి.సుదర్శన్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్.భూపతి రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ట్రైనీ కలెక్టర్ సురేష్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# కన్నుల పండుగగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

***ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ వేముల వీరేశం.***





నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 15,(విజన్ ఆంధ్ర); శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన ప్రభుత్వ విప్ కు అధికారులు పూల మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగరవేశారు. జాతీయ గీతాలాపన, గేయాలాపన, తెలంగాణ రాష్ట్ర గీతాలాపన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ విప్ ఈ సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి వివరాలను ఆయన కూలంకషంగా వివరించారు. అధికారుల పనితీరుతో జిల్లా అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలుస్తుందని చెప్పారు. జిల్లా అధికారులు సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేస్తూ, జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని అన్నారు. వేడుకల్లో భాగంగా పాఠశాలల విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ విప్, కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలోని పలు శాఖల ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. అవార్డులు ఉత్తమ పనితీరుకు నిదర్శనమని, అవార్డులు లభించిన అధికారులు మరింత ఉత్సాహంతో పనిచేయాలని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి, వారిని అభినందించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శకటాల ప్రదర్శనను తిలకించి, స్టాళ్లను వీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీస్ పరేడ్ అందరిని ఆకట్టుకుంది. జిల్లా మహిళా సంఘాలకు మంజూరైనటువంటి 50 కోట్ల రూపాయల విలువైన చెక్కులను వారికి అందజేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఏఎస్పి సాయి కిరణ్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**

**- వనపర్తిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**





వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) : ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ప్రాథమిక లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. శనివారం వనపర్తి జిల్లా ఐ.డి.ఓ.సి ప్రాంగణంలో నిర్వహించిన 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆయనకు స్వాగతం పలకగా, పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గినందున రైతులు మినుములు, కంది, జొన్న, ఆముదం వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు సాగు చేసి లాభాలు గడించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 60,545 మంది రైతులకు ₹480.91 కోట్ల రుణమాఫీ చేశామని, వానాకాలం రైతు భరోసా కింద 1.82 లక్షల మంది రైతుల ఖాతాల్లో ₹212.32 కోట్లు జమ చేశామన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు ₹500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 3.76 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ₹156.76 కోట్ల లబ్ధి పొందారు. ₹500కే సిలిండర్ పథకంలో 85,383 మందికి 5.12 లక్షల సిలిండర్లు పంపిణీ చేసి ₹15.71 కోట్లు వ్యయం చేశారు. జనవరి 1, 2026 నుంచి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 5,847 మందికి ₹18.97 కోట్ల ఉచిత వైద్యం అందించారు. 'చేయూత' పెన్షన్ల కింద 70,863 మందికి నెలకు ₹17.43 కోట్లు అందిస్తున్నారు. జిల్లాలో మంజూరైన 5,887 ఇళ్లలో 88% నిర్మాణాలు పూర్తయి, రాష్ట్రంలో వనపర్తి 13వ స్థానంలో నిలిచింది. వనపర్తిలో ₹200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ₹203.95 కోట్లతో జిల్లా ఆసుపత్రి, నాగవరం వద్ద ₹81 కోట్లతో కోర్టు సముదాయం, జూరాల కృష్ణా నదిపై ₹121 కోట్లతో వంతెన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. తొలిసారిగా 71 ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించామని తెలిపారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సత్కరించారు. 45 మహిళా స్వయం సహాయక సంఘాలకు ₹3.75 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన 138 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి**

**- వనపర్తిలో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ షురూ**







జిల్లావ్యాప్తంగా 1.83 లక్షల కార్డులు అందజేత

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. శనివారం వనపర్తి సమీకృత కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాలు, 5 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 1,83,013 స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఇందులో 26,465 కొత్త రేషన్ కార్డులు ఉన్నాయి. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు ఒకేసారి అందజేస్తున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుపై ఉన్న బార్‌కోడ్ స్కాన్ చేయడం ద్వారా రేషన్ షాపు వివరాలు, పొందే ధాన్య సమాచారాన్ని సులభంగా తెలుసుకోవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి వివరించారు. వనపర్తి నియోజకవర్గానికి రూ.2,000 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఐటీ టవర్, ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణాలు చేపడుతున్నామని, గుడిసెలు లేని వనపర్తిని నిర్మించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, పౌరసరఫరాల డిఎం ఆంజనేయులు, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సంబంధిత ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, లబ్ధిదారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అమర వీరుల పోరాటం, త్యాగాలే స్వాతంత్ర్య ఫలం

**- మైనంపల్లి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే**



మల్కాజిగిరి, ఆగస్ట్ 15,(విజన్ ఆంధ్ర): స్వాతంత్ర్య సముపార్జనలో ఎందరో వీరులు అమరులైనారని వారి పోరాటం, త్యాగాలే నేటి స్వాతంత్ర్యం అని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ నాయకు లతో కలిసి జాతీయ జెండా ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ భక్తి భావన, జాతీయ నాయకుల స్వాతంత్ర్య పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం యువత ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరే టర్ వై. ప్రేమ్ కుమార్, వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, గుండా నిరంజన్, జివిన్ని సతీష్, పిట్టల శ్రీనివాస్, ఎస్ ఆర్ ప్రసాద్, పిట్టల నాగరాజు,రాందాస్ సంతోష్ ముదిరాజ్, బాబు,సత్యనారాయణ, జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, యూసుఫ్ భాయ్, పిట్టల నాగరాజు, వినోద్ యాదవ్, ఆశా, సుమలత యాదవ్, కనక లక్ష్మి, నహీం ఖాన్, బాలరాజ్ యాదవ్, కన్నె మల్ల నాగరాజు, ఫరీద్, కపిలేశ్వర్, పార్థు, ఇస్తారి, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

**అల్వాల్ పోలీస్ స్టేషన్ లో ..**



అల్వాల్, ఆగస్ట్ 15,(విజన్ ఆంధ్ర): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరిం చుకుని శనివారంఅల్వాల్ పోలీస్ స్టేషన్ లో ఎస్ హెచ్ ఓ ప్రశాంత్ జాతీయ జెండాను ఎగర వేసి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 15,(విజన్ ఆంధ్ర); జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులతో కలిసి జాతీయ గీతాలపన చేశారు. అంతకుముందు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కలెక్టర్ మిఠాయిలు, బహుమతులు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, కలెక్టర్ క్యాంపు కార్యాలయ అధికారులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితుడిని పరామర్శించిన వెల్దండ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు..... వైద్యానికి ఆర్థిక చేయూత



చారకొండ,ఆగస్టు 15(విజన్ ఆంధ్ర) మండలంలోని జేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నెమలి గుట్ట తండాకు చెందిన కెతావత్ శ్రీను ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యెన్నమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు ఆసుపత్రికి వెళ్లి శ్రీనును పరామర్శించారు. వైద్యులను కలిసి శ్రీను ఆరోగ్య పరిస్థితి,అందుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు.మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీను కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రావు యువసేన అధ్యక్షుడు ఎండీ సిరాజ్,జేపల్లి ఉప సర్పంచ్ మధు,ఎర్రవెల్లి మాజీ సర్పంచ్ సాయికుమార్,దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ వంకేశ్వరం రమేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జేపల్లి ప్రశాంత్,మహేష్, నరేందర్,రాకేష్,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న. కానిస్టేబుల్. సి . రాజేందర్



వీపనగండ్ల. ఆగస్టు 15 విజన్ ఆంధ్ర. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీపనగండ్ల కోర్టు కానిస్టేబుల్ సి రాజేందర్ కు. వనపర్తి ఎస్పీ డి సునీత రెడ్డి ఐపీఎస్ అభినందిస్తూ ప్రశంస పత్రం అందజేశారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలో పేరెంట్ గ్రౌండ్లో భారత స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని అంకిత భావంతో పనిచేస్తూ శాంతిభద్రతల విషయంలో అంకిత భావంతో పని చేసినందుకు ఎస్పీ కోర్టు కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సి రాజేందర్ ను అభినందించారు. ప్రశంస పత్రం అందుకున్నందుకు స్థానిక ఎస్సై నరేష్. తోటి సిబ్బంది అధికారులు ప్రజాప్రతినిధులు. శుభాకాంక్షలు తెలిపారు

# నాచారంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**- నాచారం పెయింటర్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు**
**- న్యూ అంబేద్కర్ నగర్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో మరో కార్యక్రమం**
**- ముఖ్య అతిథిగా జాతీయ పతాకాన్ని ఎగురవేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడల మల్లికార్జున్ గౌడ్**
**- గౌరవ అతిథులుగా కొరపాక అంజి మాదిగ, సీనియర్ జర్నలిస్ట్ ఇడపాక సురేష్**



కాప్రా/ఆగస్టు 15 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ): నాచారం ప్రాంతంలోని నాచారం పెయింటర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, అలాగే న్యూ అంబేద్కర్ నగర్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు కార్యక్రమాల్లోనూ బీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకుడు మేడల మల్లికార్జున్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు.దఈ సందర్భంగా మేడల మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశ ప్రజలు స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నారని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. యువత విద్యతో పాటు దేశ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని, ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. న్యూ అంబేద్కర్ నగర్ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొరపాక అంజి మాదిగ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు లభించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాచారం పెయింటర్ యూనియన్ కార్యక్రమానికి గౌరవ అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త, దళిత రత్న అవార్డు గ్రహీత ఇడపాక సురేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం మనకు కల్పించిన హక్కులను బాధ్యతగా వినియోగించుకోవాలని అన్నారు. దేశ ఐక్యత, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. నాచారం పెయింటర్ యూనియన్ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మణ్, చింత మధు, వేర్పుల సుమన్, నర్సింగ్, మందుల మల్లేష్, మోతె సురేష్ ఎమ్మార్పీఎస్ నాచారం నాయకులు బొడ్డు శివ తదితరులు పాల్గొన్నారు. న్యూ అంబేద్కర్ నగర్ కార్యక్రమంలో నజీర్ పాషా, నాచారం పెయింటర్ యూనియన్ నాయకులు చింత మధు, వేర్పుల సుమన్, ఎమ్మార్పీఎస్ నాచారం నాయకులు బొడ్డు శివ, నాచారం ఆటో యూనియన్ నాయకులు తాటికాయల కుమార్, శాంతం రమేష్, రవి, బిక్షపతి మరియు న్యూ అంబేద్కర్ నగర్, నాచారం ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవు

**- కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్. లెంకల భాస్కర్ రెడ్డి.**




కాప్రా / ఆగస్టు 15(విజన్ ఆంధ్ర ప్రతినిధి ): మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే పిల్లలతో పాటు తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ లంకల భాస్కర్ రెడ్డి హెచ్చరించారు. కుషాయిగూడ డివిజన్ పరిధిలోని ద్వారకపురి కాలనీలో అక్షర హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం అ నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లెంకల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే గురుతర బాధ్యతని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సెల్‌ఫోన్లు, వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. పిల్లలపై ప్రేమతో, గారాబంతో వాహనాలు ఇస్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని హెచ్చరించారు. వాహనాలను అతివేగంగా, ఇష్టానుసారంగా నడపడం వల్ల పిల్లల ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందన్నారు. ప్రమాదాల్లో గాయపడితే జీవితాంతం వైకల్యంతో బాధపడే పరిస్థితి రావచ్చని తెలిపారు. పిల్లలకు వయసు వచ్చే వరకు, డ్రైవింగ్ నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహన వచ్చే వరకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను కోరారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాల నేపథ్యంలో మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లెంకల భాస్కర్ రెడ్డి హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అక్షర హైస్కూల్ కరస్పాండెంట్ బౌరంపేట మల్లారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు మొదటి గురువులైతే, ఉపాధ్యాయులు రెండో గురువులుగా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు స్మార్ట్‌ఫోన్లు ఇవ్వవద్దని కోరారు. సెల్‌ఫోన్‌లకు బానిసలై విద్యార్థులు తమ విలువైన జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశలోని పదేళ్ల కాలాన్ని తమ భవిష్యత్తు కోసం వినియోగించుకుని చదువుపై దృష్టి సారించాలని బౌరంపేట మల్లారెడ్డి సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఎంతోకష్టపడుతున్నారని, అదే సమయంలో సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు ఇచ్చి వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. అక్షర హైస్కూల్ ప్రిన్సిపల్ బౌరంపేట అర్చన రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై గురుతర బాధ్యత ఉందన్నారు. సమాజంలో వస్తున్న సాంకేతిక మార్పులు, వింత పోకడలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముందుగా తమలో మార్పు తెచ్చుకుని స్వచ్ఛమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. నిమ్మ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత పదవులను సాధించాలని ఆకాంక్షించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం గురించి విద్యార్థులకు వివరించారు. ఎస్ఐ సతీష్ సెల్‌ఫోన్ వినియోగం, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జెండా తలకిందులుగా ఎగరేసిన దుగ్గొండి ఎమ్మార్వో

**- ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్**
**- తహసీల్దార్ ముస్క సమ్మక్క తీరుపై విమర్శలు**



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు15(విజన్ ఆంధ్ర); స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని తలకిందులుగా ఎగురవేసిన ఘటన దుగ్గొండి మండల కేంద్రంలో చర్చనీయాంశమైంది. తహసీల్దార్ ముస్క సమ్మక్క జాతీయ జెండాను ఆవిష్కరించిన సమయంలో పతాకం తలకిందులుగా ఉన్నట్లు స్థానికులు గుర్తించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దుగ్గొండి మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, స్థానికుల సమక్షంలో అధికారిక కార్యక్రమం నిర్వహించారు. నిర్ణీత సమయంలో తహసీల్దార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, అనంతరం పతాకం తలకిందులుగా ఉన్న విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. జాతీయ పతాకం విషయంలో ముందస్తుగా తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఈ అంశాన్ని ఎలా గుర్తించలేక పోయారనే ప్రశ్నలు వ్యక్తమవుతు న్నాయి. జాతీయ పతాకం దేశ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని, దాన్ని ఎగురవేసే సమయంలో అత్యంత జాగ్రత్త అవసరమని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు జెండాను ఎవరు సిద్ధం చేశారు, అధికారులు తనిఖీ చేశారా అనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పతాకావిష్కరణ కార్యక్రమాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# జడ్చర్లలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**- ఎమ్మెల్యే అనిరుదద్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరణ**
**- అవినీతి రహిత నియోజకవర్గంగా జడ్చర్లను తీర్చిద్దుతా**
**- అవినీతి అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
**- ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులకు సూచన**
**- భూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని పిలుపు**
**- జడ్చర్లను ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే**



జడ్చర్ల / ఆగస్టు 15, (విజన్ ఆంధ్ర): దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఘనంగా జరిగాయి. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించిన ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**అవినీతిపై ఉక్కు పాదం**

జడ్చర్ల నియోజకవర్గంలో కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు తమ పనితీరు మార్చుకుని ప్రజలకు జవాబుదారీతనంతో, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జడ్చర్లను అవినీతి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఆ దిశగా పనిచేస్తున్న సమయంలో అధికారులు అవినీతికి పాల్పడటం సరికాదని స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం**

పేద ప్రజలు తమ భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం నేరుగా జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఎలాంటి ఖర్చు లేకుండా న్యాయబద్ధంగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధే లక్ష్యం**

రాబోయే రోజుల్లో జడ్చర్ల నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సహకారంతో అన్ని రంగాల్లో జడ్చర్లను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. జాతీయ జెండా రంగులతో, రంగవల్లులతో కార్యక్రమ స్థలం అందంగా అలంకరించారు.

# దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటు పడాలి

**- ప్రతి ఒక్కరు పూర్తి వందేమాతరం ఆలపించాలి**
**- పలు చోట్ల త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**



నిజామాబాద్ ఆగస్టు15:(విజన్ ఆంధ్ర )ప్రతి ఒక్కరు దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటుపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు అసోసియేషన్ల కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తొలిసారి పూర్తి వందేమాతరం గీతాన్ని పాడాలని చట్టం తీసుకురావడం మంచి పరిణామం అన్నారు. ఇకపై ఎక్కడైతే జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారో అక్కడ పూర్తి వందేమాతరం ఆలపించాలని కోరారు. స్వాతంత్ర సమరయోధుల పోరాట స్ఫూర్తితో దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఆనాటి అమరుల త్యాగాల వల్లే స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామని పేర్కొ న్నారు. 2047 వరకు వికసిత్ భారత్ సాధించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. జాతీయ సమైక్యత, దేశ భద్రత, స్వదేశీ ఆత్మ విశ్వాసం దిశగా ముందుకు సాగాలన్నారు. మొదటగా బస్ స్టాండ్ ఆవరణలోని ఆటో స్టాండ్ అసోసియేషన్, అనంతరం లలిత కాంప్లెక్స్‌లోని మొబైల్ షాప్స్ అసోసియేషన్, అనంతరం క్యాంపు కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే సన్ రైజ్ హాస్పిటల్ లో జాతీయ జెండాను ఎగురవేశారు. కాగా బీజేపీ జిల్లా కార్యాలయం, కార్పొరేషన్ కార్యాలయంలో, పరేడ్ మైదానంలో జరిగిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పోరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో అట్టహాసంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**- డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులతో మరింత పారదర్శకత, జవాబుదారీతనం**
**- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి**
**- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు**



నిజామాబాద్, ఆగస్టు 15 : (విజన్ ఆంధ్ర ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిజామాబాద్ లో శనివారం పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగింది. నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

జ్యోతి ప్రజ్వలన చేసి, జయ జయహే తెలంగాణ గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక స్థోమత కలిగిన వారి తరహాలోనే నిరుపేద కుటుంబాలు కూడా మూడు పూటల అన్నం తినాలనే ఉదాత్తమైన ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. ఇదివరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గత ప్రభుత్వం అందించిన దొడ్డు బియ్యం తినడానికి ఉపయోగపడక 70 శాతం అమ్ముకునే వారని, సబ్సిడీ బియ్యం బ్లాక్ మార్కెట్ కు తరలిపోయేదని గుర్తు చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో పేదలకు ఆహార భద్రత భరోసా ఏర్పడిందని అన్నారు. డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం తీసుకువచ్చిందని తెలిపారు. పేదల కోసం ఉద్దేశించిన రేషన్ సన్న బియ్యం ఒక్క గింజ కూడా పక్కదారి పట్టకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. స్మార్ట్ కార్డుల వల్ల లబ్ధిదారులకు రేషన్ పొందడంలో మరింత సౌలభ్యం కలుగుతుందని, ఎక్కడి నుంచి అయినా ఈ కార్డు ద్వారా రేషన్ సరుకులు పొందే వెసులుబాటు లభించిందని అన్నారు.

ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. సంక్షేమంతో పాటు మౌలిక వసతులు, వ్యవసాయం, విద్య, ఉపాధి, ప్రజా సేవల రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం నిరంతర కృషిని కొనసాగిస్తోందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో 4.77 లక్షల కుటుంబాలకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం సైతం తప్పిపోకుండా ప్రతి కుటుంబానికి పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా ఈ కార్డులను పంపిణీ చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తొమ్మిది రకాల భద్రతా ప్రమాణాలను జోడిస్తూ డిజిటల్ రూపంలో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల నకిలీ, బినామీలు, రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని, అర్హులైన వారికి నేరుగా ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ అన్నారు.

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుల సంక్షేమానికి రైతు భరోసా, మహిళలకు అండగా కళ్యాణ లక్ష్మి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు సన్నబియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో కొత్త రేషన్ కార్డుల జారీపై తగిన దృష్టి పెట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టిందని గుర్తు చేశారు. డిజిటల్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలనలో మరో కీలక ముందడుగు వేసిందన్నారు. సాంకేతికత ఆధారిత పాలన ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సరళంగా, పారదర్శకంగా ప్రజలకు అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, 2047 నాటికి రైజింగ్ తెలంగాణగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు.

నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డిలు మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం దక్కేలా చూడాలన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎక్కడ కూడా అక్రమాలకు తావులేకుండా జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. గత సీజన్ లో ధాన్యం విక్రయాలకు రైతులు ఒకింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, మున్సిపల్ చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, రేషన్ డీలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది

**- నూతన డిజిటల్ రేషన్ కార్డులతో ప్రజలకు అన్ని విధాలుగా మేలు**
**- ప్రభుత్వ విప్ వేముల వీరేశం.**




నిర్మల్ :ఆగష్టు 15:విజన్ ఆంధ్ర : సోన్ మండలం కడ్తాల్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్‌లో శనివారం సాయంత్రం నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందాలనే ఉన్నతమైన లక్ష్యంతో ఈ కొత్త డిజిటల్ రేషన్ కార్డుల రూపకల్పన జరిగిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 2 లక్షల 49 వేల 313 నూతన డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పారదర్శకమైన పాలన అందిస్తూ, రేషన్ కార్డును కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా, ప్రభుత్వ పథకాలన్నింటికీ ఒక నమ్మకమైన గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించి ప్రతీ ఇంట్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వేస్తోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను ప్రభుత్వం అత్యంత సులభతరం చేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలంతా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్ బియ్యాన్ని బయట అమ్ముకోకూడదని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా పేదలకు లబ్ది చేకూరుతుందన్నారు. రేషన్ బియ్యం ప్రజలందరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, ప్రజలకు అందించే రేషన్ బియ్యంలో కేంద్ర ప్రభుత్వం సహకారం ఉందని గుర్తు చేశారు. రేషన్ కార్డులు ఎన్నో ప్రభుత్వ పథకాలకు ప్రామాణికమని చెప్పారు. నూతన రేషన్ కార్డుల పంపిణీతో ప్రజలకు మేలు కలుగుతుందని అన్నారు. అనంతరం జిల్లాకు చెందిన పలువురు లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి రాజేందర్, నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్, సర్పంచ్ గుర్రం రాము, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,సిబ్బంది, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల



నిజామాబాద్ ఆగస్టు15:( విజన్ ఆంధ్ర ) స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బిగాల నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మొదట ఎల్లమ్మగుట్టలోని BRS పార్టీ జిల్లా కార్యాలయంలో, BRS పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు శ్రీ జీవన్ రెడ్డి మాజీ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం RR చౌరస్తా శివాజీ చౌక్‌లో సిర్ప రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.అలాగే జూబ్లీ హోటల్ చౌరస్తా, ఖిల్లా రోడ్‌లో దీ=హా నాయకులు అబ్దుల్ మతీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. 58వ డివిజన్ అధ్యక్షులు సమీ ఆధ్వర్యంలో దారుగల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 15వ డివిజన్ దీ=హా నాయకులు ముస్తాక్ ఆధ్వర్యంలో నిజాం కాలనీ మెయిన్ రోడ్, అర్సపల్లిలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కూడా మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్,చీఖణాా మాజీ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి ,సుజిత్ సింగ్ నాగారం నర్సింగ్ మరియు దీ=హా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పంపిణీ చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు





80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఎ) ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రుణాలకు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. జిల్లాలోని 1,219 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.143 కోట్ల రుణాల చెక్ ను మంత్రి మహిళ సంఘాల సభ్యులకు అందజేశారు. అలాగే నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ కింద 559 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.1.11 కోట్ల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. అనంతరం స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగంగా 350 మందికి టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు, 25 మంది విద్యార్థులకు సైకిళ్లు, 14 మంది లబ్ధిదారులకు స్కూటర్లు మంత్రి జూపల్లి కృష్ణారావు పంపిణీ చేశారు. మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,దేవరకద్ర శాసన సభ్యులు సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి, ఎస్.పి.డి.జానకి, మేయర్ మమత,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల కోటి,అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్ రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్ బి హరిప్రియ,తదితరులు పాల్గొన్నారు

# స్టాళ్లను సందర్శించిన రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్ నగర్, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర):80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మహబూబ్‌నగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు అందిస్తున్న సేవలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంత్రి సందర్శించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. వి.బి.జీ. రాంజీ, పి.ఎం.కె.ఎస్.వై, స్వచ్ఛ భారత్ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫొటో ప్రదర్శనను వీక్షించారు. అనంతరం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను పరిశీలించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి, సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ, జిల్లా వైద్యారోగ్య, విద్య, విద్యుత్, వ్యవసాయ, మత్స్య, రోడ్లుభవనాలు, ట్రాఫిక్ పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా మంత్రి సందర్శించారు. ఆయా శాఖలు చేపడుతున్న అభివృద్ధి,



సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులతో చర్చించారు.

**- స్టాళ్ల ప్రదర్శనలో మెప్మాకు ప్రథమ బహుమతి**

స్టాళ్ల ప్రదర్శనలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కు ఉత్తమ స్టాల్‌గా ప్రథమ బహుమతి లభించింది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కు ద్వితీయ బహుమతి, మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కు తృతీయ బహుమతి లభించింది. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులు, ఉద్యోగులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశంసా పత్రాలను

**- సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.**

ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,దేవరకద్ర శాసన సభ్యులు సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి, ఎస్.పి.డి.జానకి, మేయర్ మమత,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల కోటి,అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్ రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్ బి హరిప్రియ,తదితరులు పాల్గొన్నారు

# "రాజగోపాల్ రెడ్డి అగ్నిపర్వతం... ఆయన మాటల్లో తప్పులేదు"

**- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు...**

**- పార్టీ ఇష్యూస్ పరిష్కరించాలని డిమాండ్...**



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 15: కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి బహిరంగంగా మద్దతు ప్రకటించారు. రాజగోపాల్ రెడ్డి మాట్లాడే దాంట్లో ఏమాత్రం తప్పులేదని, పార్టీ మంచి కోసమే ఆయన నిలదీస్తున్నారని స్పష్టం చేశారు.

**- "ఆయన మండే అగ్నిపర్వతం"**

రాజగోపాల్ రెడ్డిని "మండే అగ్నిపర్వతం"తో పోల్చిన అనిరుధ్ రెడ్డి, ఆయన ఎప్పుడూ ప్రజా సమస్యలపైనే గళమెత్తుతారని అన్నారు. "ఈ రెండున్నరేళ్ల కాలంలో మంత్రి పదవి కావాలని గానీ, పదవుల కోసం గానీ ఆయన ఎప్పుడూ అడగలేదు. కానీ పార్టీలో ఉన్న లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని కోరుతున్నారు" అని అన్నారు.

**- "ఇష్యూస్ ఉన్నాయి... సరిచేస్తే పార్టీకే మంచిది"**

పార్టీలో కొన్ని ఇష్యూస్ ఉన్న మాట వాస్తవమని, వాటిని సరిదిద్దుకుంటే కాంగ్రెస్ పార్టీకే మంచిదని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. "కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు రావాలనే ఉద్దేశంతోనే రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా మాట్లాడుతున్నారు. ఆయన వ్యాఖ్యలను తప్పుపట్టాల్సిన అవసరం లేదు" అని అన్నారు.

**- గతంలోనూ అనిరుధ్ రెడ్డి వైఖరి ఇదే**

ఇది మొదటిసారి కాదు. గతంలోనూ పార్టీలోని సమస్యలపై, ప్రజా సమస్యలపై అనిరుధ్ రెడ్డి బహిరంగంగా మాట్లాడారు. పార్టీ నాయకత్వం తప్పులు చేస్తే ప్రశ్నించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన పలుమార్లు సూచించారు. పార్టీలో అంతర్గత చర్చల కంటే ప్రజల సమస్యల పరిష్కారమే ముఖ్యమని ఆయన వాదన. ప్రత్యేకించి పాలమూరు జిల్లా అభివృద్ధి, రైతు సమస్యలు, ఉద్యోగాల అంశంపై ఆయన గతంలోనూ ప్రభుత్వాన్ని నిలదీశారు. పార్టీకి నష్టం జరగకూడదనే ఉద్దేశంతోనే నాయకులు ముందుకు వచ్చి సమస్యలను చర్చించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

**- రాష్ట్ర రాజకీయాల్లో చర్చ**

ఇటీవల రాజగోపాల్ రెడ్డి పార్టీ వ్యవహారాలపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త చర్చకు దారితీశాయి. పార్టీని బలోపేతం చేయడానికి అంతర్గత విమర్శలు అవసరమేనని, వాటిని సానుకూలంగా తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి సందేశం ఇచ్చారు.

# హైవే దాటుతుండగా మృత్యుఘోష.. ఆయిల్ ట్యాంకర్ ఢీకొని కూలీ మృతి

**- కొంపల్లి సమీపంలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం**

**- అశోక్ టైర్స్ వద్ద రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన ట్యాంకర్**




డ్రైవర్‌పై కేసు నమోదు.. వాహనం స్వాధీనం చేసుకున్న పేట్-బషీరాబాద్ పోలీసులు

కొంపల్లి, ఆగస్టు 15: (విజన్ ఆంధ్ర); హైవేపై రోడ్డు దాటుతున్న ఓ కూలీని ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన పేట్-బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్లకు చెందిన చిలుకూరి నరేష్ (36) కూలీ పని ముగించుకుని శనివారం తెల్లవారుజామున ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సుమారు ఉదయం 2 గంటల సమయంలో కొంపల్లి సమీపంలోని అశోక్ టైర్స్ వద్ద హైవే రోడ్డు దాటుతుండగా.. మేడ్చల్ వైపు నుంచి కొంపల్లి వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ ఆయిల్ ట్యాంకర్ (౨+-12-౨-7308) అతడిని ఢీకొట్టింది. ట్యాంకర్‌ను నడుపుతున్న మహమ్మద్ ఖలీద్ (40) అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. ట్యాంకర్ ముందు కుడివైపు టైర్ నరేష్‌పై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన అతడు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పేట్-బషీరాబాద్ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైవేలపై ప్రయాణించే పాదచారులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, వాహనదారులు వేగాన్ని నియంత్రిస్తూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

# ఇక పై అవినీతి లేకుండా పారదర్శకంగా రేషన్ పంపిణీ

**- స్మార్ట్ కార్డులతో లబ్ధిదారులకు తప్పనున్న ఇబ్బందులు**

**- మార్పులు చేర్పులు మరింత సులభం**

**- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం ఆపలేదు**

**- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని కాంచనంగా ప్రారంభించిన రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,**

**- పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



మహబూబ్ నగర్, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర): ఇకపై రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత సులభతరం కానున్నదని, అత్యంత పారదర్శకంగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా రేషన్ పంపిణీ వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, మహబూబ్ నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తా తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డుల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా కోటీ ఐదు లక్షల స్మార్ట్ కొత్త రేషన్ కార్డులను జారీ చేసినట్లు తెలిపారు. కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం ద్వారా అదనంగా సన్నబియ్యం అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో కొత్తగా మంజూరు చేసిన కార్డులతో కలిపి మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 2,79,523 కు చేరిందన్నారు. వీటితో 9,61,377 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు.



**- డిజిటల్ రేషన్ కార్డులతో పారదర్శకత**

సాంకేతికతను వినియోగించుకుని రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా మార్చినట్లు మంత్రి తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాల్లో మార్పులు, కొత్త సభ్యుల చేరిక, వివాహం అనంతరం పేర్ల మార్పు వంటి ప్రక్రియలను మరింత సులభతరం చేయడమే స్మార్ట్ రేషన్ కార్డుల ప్రధాన ఉద్దేశమన్నారు. రేషన్ దుకాణాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన సరుకులు, వాటి నిల్వలు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన సరుకుల వివరాలను సైతం పారదర్శకంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డులోని వివరాలను లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో పరిశీలించుకోవచ్చన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడటం, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడం, అవినీతికి అవకాశం లేకుండా చేయడమే ఈ విధానం లక్ష్యమని తెలిపారు. గత రెండున్నరేళ్లలో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యానికి బోనస్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు అందించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలను మాత్రం ఆపడం లేదని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుని పిల్లలు జ్ఞానాన్ని పెంపొందించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, స్వయం సమృద్ధి కోసం మహిళా సంఘాలు, రైతు సంఘాలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**- స్మార్ట్ రేషన్ కార్డుతో సేవలు మరింత సులభం: ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆహార భద్రత, ఆరోగ్య భద్రతకు రేషన్ కార్డు ఎంతో కీలకమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 2023 వరకు కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదని, కుటుంబంలో కొత్తగా చేరిన సభ్యుల పేర్లను కూడా చేర్చుకునే అవకాశం లేక అనేక మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీకి చర్యలు చేపట్టిందన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 63,367 రేషన్ కార్డులు ఉన్నాయని, వీటిలో సుమారు 20వేల కొత్త రేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. మే 31వరకు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోందని, తదుపరి దశలో అర్హులైన వారికి కూడా స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు మొబైల్‌లో కనిపిస్తాయని ఎమ్మెల్యే వివరించారు. కుటుంబంలో కొత్త సభ్యులను చేర్చడం, అర్హత మేరకు పేర్లను తొలగించడం వంటి ప్రక్రియలను కూడా సులభతరం చేసినట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులను ఎవరూ ట్యాంపరింగ్ చేయడం లేదా నకిలీ కార్డులు రూపొందించడం వంటి చర్యలకు పాల్పడవద్దని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**- స్మార్ట్ కార్డుతో వివరాల పరిశీలన సులభం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కోటికి పైగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కార్డులో నమోదైన కుటుంబ సభ్యుల వివరాలను ఎప్పుడైనా సులభంగా పరిశీలించుకోవచ్చన్నారు. పేర్లు చేర్చడం లేదా తొలగించడం వంటి వివరాలను కూడా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. దీనివల్ల లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని, రేషన్ డీలర్లకు కూడా వివరాలను స్పష్టంగా తెలియజేయడం సులభమవుతుందని తెలిపారు. లబ్ధిదారులు స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మేయర్ జి. మమత, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ మూడావత్ బాలకోటి, డి. ఎస్.సి.ఓ గంప శ్రీనివాస్, జిల్లా అధికారులు, స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ మైదానంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వినూత్నంగా అలంకరించిన శకటాల ద్వారా ఆయా శాఖలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శించాయి. శకటాల ప్రదర్శనలో అగ్నిమాపక, మున్సిపల్, వ్యవసాయ, విద్యుత్, వైద్య ఆరోగ్య, మహిళా శిశు ,సంక్షేమ శాఖ సంక్షేమ, గృహ నిర్మాణ, పోలీస్, విద్య, గ్రామీణ అభివృద్ధి శాఖలు పాల్గొన్నాయి. ఆయా శాఖల కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను శకటాల ద్వారా వివరించడంతో వేడుకలకు హాజరైన ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. వ్యవసాయ శాఖ శకటం ద్వారా రైతు వారోత్సవాలు, విత్తన మేళాలు, తోటల పరిరక్షణ, ఎల్‌నినో




పరిస్థితులను ఎదుర్కొనేందుకు అమలు చేస్తున్న కంటింజెన్సీ ప్రణాళిక, ఆయిల్‌పామ్ తోటల పెంపకం తదితర కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యుత్ శాఖ శకటంలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'గృహజ్యోతి' పథకాన్ని వివరించారు. జిల్లా సంక్షేమ శాఖ శకటం ద్వారా బాలికలకు సైకిళ్ల పంపిణీ, మహిళా సంఘాల సభ్యులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రదర్శించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ శకటం ద్వారా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న బ్యాంకు లింకేజీ, 'మహిళా శక్తి' తదితర కార్యక్రమాలను వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ శకటం ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, 'బేటీ బచావోబేటీ పడావో', హెచ్‌పీవీ టీకా కార్యక్రమం, స్వయం సహాయక సంఘాల సభ్యులకు నిర్వహిస్తున్న 32 రకాల వైద్య పరీక్షలు తదితర అంశాలను ప్రజలకు అవగాహన కలిగించేలా ప్రదర్శించారు. గృహ నిర్మాణ శాఖ శకటం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకం, విద్యాశాఖ శకటం ద్వారా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ఉచిత ప్రాథమిక విద్య తదితర కార్యక్రమాలను ప్రదర్శించారు.

వ్యవసాయ శాఖకు ప్రథమ బహుమతి

శకటాల ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వ్యవసాయ శాఖ శకటానికి ప్రథమ బహుమతి లభించింది. గ్రామీణ అభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ) శకటానికి ద్వితీయ బహుమతి, గృహ నిర్మాణ శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించాయి. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,దేవరకద్ర శాసన సభ్యులు సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి, ఎస్.పి.డి.జానకి, మేయర్ మమత,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల కోటి,అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్ రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్ బి హరిప్రియ,తదితరులు పాల్గొన్నారు

# దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి - చేవూరి ఉషశ్రీ ,అర్జున్..!

కాప్రా/ ఆగష్టు 15(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్ ఎఫ్ సి కాలనీలో 80వ. స్వతంత్ర దినోత్సవ వేడుకలు



చేవూరి ఉషశ్రీ ,అర్జున్,ఐరా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవూరి ఉషశ్రీ, అర్జున్, ఐరా పాల్గొని జాతీయ



జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు, కాలనీవాసులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు కలసి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశ ప్రజలు స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నారని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. యువత విద్యతో పాటు దేశ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని, ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# "మహనీయుల ఆశయాలే మన స్ఫూర్తి"

**- కలెక్టర్ బోర్ఖడే హేమంత్ చేతుల మీదుగా ములుగులో జాతీయ జెండా ఆవిష్కరణ**



ములుగు ఆగస్ట్ 15, విజన్ ఆంధ్ర ప్రతినిధి : దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ములుగు జిల్లా కలెక్టరేట్‌లో శనివారం భక్తి, దేశభక్తి ఉత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ శ్రీ. బోర్ఖడే హేమంత్ సహదేవరావులి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి అధికారి, ఉద్యోగి ప్రజా సేవకు అంకితం కావాలని, ప్రజలకు మెరుగైన పాలన అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, రేపటి భారత భవిష్యత్తుగా మారాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లిసి.హెచ్. మహేందర్, జి. సంపత్ రావులి, ఆర్డీఓ కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, డీసీఎస్ఓ షా ఫైజల్ హుస్సేనీ, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, డీపీఆర్ఓ ఎం.డి. రఫిక్, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్ తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్వకుర్తి నుంచి జిల్లా స్థాయిలో ఇద్దరికి గుర్తింపు

## 80వ స్వాతంత్ర్య దినోత్సవాన ప్రశంసా పత్రాలు, ఉత్తమ అవార్డులు



వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలిసి జాతీయ జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి....



అధికారులు, ప్రజా ప్రతినిధుల చేత ఉత్తమ ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న కానిస్టేబుల్ చిరంజీవి...



సింగిల్ విండో కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేసిన చైర్మన్ జనార్దన్ రెడ్డి....

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన అధికారిక కార్యక్రమంలో కల్వకుర్తికి చెందిన ఇద్దరు ఉద్యోగులు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందుకున్నారు. నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌కు చెందిన క్రైమ్ కానిస్టేబుల్ చిరంజీవి ఉద్యోగ నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను జిల్లా కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధాన వేడుకల్లో కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. శ్రీపాద శార్వాణికి ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగి అవార్డు-2026 లభించింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎంపీ డా. మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు. కల్వకుర్తి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యార్థులకు ప్రత్యేక యూనిఫామ్ అందించడంతో పాటు దాతల సహకారంతో కళాశాల అభివృద్ధికి ఆమె చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించింది.

**- కల్వకుర్తిలోనూ ఘనంగా వేడుకలు**

కల్వకుర్తి పట్టణంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద అధ్యక్షుడు తలసాని జనార్ధన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వేంకట్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని వృద్ధాశ్రమంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. "వృద్ధుల సేవే సమాజానికి నిజమైన గౌరవం. వారు మన అనుభవ సంపద" అని ఎమ్మెల్యే అన్నారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు పెరుమాళ్ల వెంకటయ్యను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, డీసీ అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి పాలమూరులో 80వ స్వాతంత్ర్య సంబరాలు

## ఐదు జిల్లాల్లో జాతీయ జెండాలు, సేవా కార్యక్రమాలతో దేశభక్తి ఉత్సాహం

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 15: దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరిగింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల అనే ఐదు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాల నుంచి గ్రామ స్థాయి వరకు త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, సంఘాలు, సామాన్యులు పెద్ద ఎత్తున పాల్గొని స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. జిల్లా కేంద్రం మహబూబ్‌నగర్‌లోని కలెక్టర్ కార్యాలయం ప్రాంగణం ఉదయం నుంచే దేశభక్తి నినాదాలతో మార్మోగింది. జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రసంగిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జెండా ఎగురవేసి పోలీస్ బలగాల నుంచి గౌరవ వందనం తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు. జిల్లా పరిషత్, మున్సిపల్, రెవెన్యూ, విద్య, వైద్య, వ్యవసాయ, నీటి పారుదల తదితర అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి ఉద్యోగులతో కలిసి జాతీయ గీతం ఆలపించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో స్వాతంత్ర్య వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అధికారిక కార్యక్రమం జరిగింది. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ఎంపీ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేశారు. వనపర్తి జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా జెండా ఆవిష్కరించి యువత దేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ కార్యాలయాల వద్ద జెండా ఎగురవేసి ప్రజలకు స్వాతంత్ర్య విలువలను గుర్తు చేశారు. నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు వివిధ కుల సంఘాలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సైతం జాతీయ జెండా కార్యక్రమాలు నిర్వహించాయి. సమాజంలో సమానత్వం, ఐక్యత సందేశాన్ని ఇచ్చారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్, మార్కెట్ వద్ద యువకులు జెండాలు ఎగురవేసి దేశభక్తి నినాదాలు చేశారు. గద్వాల జిల్లాలో పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వివరించారు. జిల్లా కేంద్రంలో అధికారులు జెండా ఆవిష్కరించిన అనంతరం అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఐదు జిల్లాల్లోని గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా జరిగాయి. పంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, సహకార సంఘాల వద్ద స్థానిక ప్రజా ప్రతినిధులు జెండా ఎగురవేశారు. జడ్చర్ల, షాద్‌నగర్, కొల్లాపూర్, ఆలంపూర్ వంటి పట్టణాల్లోనూ ప్రజలు ఇళ్లు, దుకాణాలపై త్రివర్ణ పతాకాలు ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, సేవా కార్యక్రమాలు కొనసాగాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్యం తెచ్చిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, భావి తరాలకు మంచి సమాజాన్ని అందించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం ప్రజల్లో జాతీయ భావాన్ని మరింత బలపరిచింది. ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో వేడుకలు విజయవంతమయ్యాయి.



దేశభక్తుల వేషధారణలో చిన్నారులు....



దేశభక్తుల వేషధారణలో చిన్నారులు....



మహబూబ్ నగర్ ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేస్తున్న ఎస్పీ జానకి....

# ఒక మంత్రి చేయవలసిన అభివృద్ధి లేదు, ప్రతి గ్రామానికి అభివృద్ధి శూన్యం

**- అభివృద్ధి ప్రకటనలకే పరిమితం - మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**



మెదక్ /రేగోడ్ ఆగస్టు 15(విజన్ ఆంధ్ర ):రేగోడు మండల కేంద్రంలో శనివారం నాడు ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రెస్ మీట్ లో ఆందోల్ నియోజకవర్గం ప్రజలందరికీ 80 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామంలో ఒక మంత్రి పథకాలు అమలు, సింగూరు ముంపు ప్రాంతం ,రేగోడు అల్లాదుర్ ,టేక్మల్, మండలాలను సంగారెడ్డి జిల్లాలో కలుపుతున్నాను అని చెప్పి రెండు ఏళ్ళు గడిచిన మూడు మండలాన్ని సంగారెడ్డిలో కలపకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారు అని అన్నారు. మంత్రి అయిన తర్వాత ఆందోల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుపుతారని ఆశించిన ప్రజలకి నిరాశపరిచారని తెలియజేశారు. నేను గతంలో ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు రెండు ఏండ్లు కరోనా రావడం జరిగింది మిగతా మూడు ఏళ్లలో ప్రతి గ్రామానికి కోటి రూపాయల నిధులను ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు దగ్గరికి వచ్చిన కూడా ప్రకటనలు మాత్రమే చేస్తూన్నారు తప్ప అభివృద్ధి మాత్రం శూన్యంగా ఉందని విమర్శించారు. నిమ్స్ పరికరాలు,కొనుగోలు,బదిలీలలో స్కాం,అనుభవం లేని వ్యక్తి,రెట్లు పెంచి మళ్ళీ శాంక్షన్ చేయడం,బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్ట్ పనులు ముందుకు జరగకపోవడం.రేగోడ్,అల్లదుర్గ్,టేక్మల్ రోడ్లు లేవు,10 శాతం కూడా నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయలేదు.రేగోడ్ లో కమిటీ హాల్లు,ఒక గ్రామానికి 20 లక్షలు కేసీఆర్ ఇచ్చారు.ఇప్పటివరకు బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన మాత్రమే ఆందోల్ నియోజకవర్గ మండలాలు గ్రామాలలో కనబడుతుందని తెలియజేశారు.ఇకనైనా మంత్రి నియోజకవర్గం పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రజలకు మేలు జరిగేవిదంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వంన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, నారాయణ, మాజీ అధ్యక్షులు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి సుంకే రమేష్, మాజీ ఎంపీటీసీ గొల్ల నర్సింలు,గ్రామ అధ్యక్షులు రాచోటి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను పరామర్శించిన అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



మెదక్ /రేగోడుఆగస్టు 15 (విజన్ ఆంధ్ర ) : రేగోడు మండల కేంద్రంలో శనివారం అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్యారారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త మెత్తరి ఎసు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న రమేష్‌రావు, మరెల్లి రామయ్యలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రేగోడులో ఇటీవల అనారోగ్యానికి గురైన 'మెట్రో ఈవినింగ్' పత్రిక విలేకరి సుభాష్ గౌడ్‌ను కూడా క్రాంతి కిరణ్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటానని తెలిపారు. కార్యకర్తల యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో బీఆర్ఎస్‌లో ముదురుతున్న వార్..

# గండ్ర వర్సెస్ సిరికొండ.

*టికెట్ రేసు నుంచి కేడర్ పట్టు వరకు ఎవరి దారి వారిదే ఉద్యమకారుల అండ సిరికొండకు. క్షేత్రస్థాయిలో గండ్ర కు బలం. అధిష్ఠానం జోక్యం చేసుకోకపోతే మరింత ముదిరే అవకాశం లేకపోలేదు.*

**భూపాలపల్లి జిల్లా ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర )**

భూపాలపల్లి బీఆర్ఎస్‌లో వర్గపోరు మరోసారి బహిరంగ చర్చగా మారింది. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి వర్గాల మధ్య చాలాకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ఇప్పుడు మళ్లీ వేడెక్కుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇటీవల సిరికొండ మధుసూదనాచారిపై వ్యక్తిగత విమర్శలు చేయొద్దంటూ ఆయన అనుచరులు, ఉద్యమకారులు బహిరంగంగా హెచ్చరించడం ఈ విభేదాలకు కొత్త మలుపుగా మారింది. జూలై 2026లో భూపాలపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో సిరికొండ వర్గీయులు గండ్ర వర్గంపై తీవ్ర విమర్శలు చేయడం పరిస్థితి ఎంత సున్నితంగా మారిందో చెబుతోంది. అసలు కథ టికెట్ చుట్టూనేనా? భూపాలపల్లి బీఆర్ఎస్‌లో గండ్రసిరికొండ మధ్య పోటీకి రాజకీయ నేపథ్యం చాలా పాతది. 2014లో సిరికొండ మధుసూదనాచారి ఎమ్మెల్యేగా గెలిచి తెలంగాణ తొలి శాసనసభాపతిగా పనిచేశారు. 2019లో ఆయనపై గండ్ర వెంకటరమణారెడ్డి విజయం సాధించారు. అనంతరం గండ్ర బీఆర్ఎస్‌లో చేరడంతో ఇద్దరూ ఒకే పార్టీలోకి వచ్చినా, పాత రాజకీయ పోటీ పూర్తిగా సమసిపోలేదన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో కొనసాగుతూ వచ్చింది. 2023లో బీఆర్ఎస్ టికెట్ గండ్రకే దక్కగా, ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు చేతిలో ఓడిపోయారు. అదే సమయంలో సిరికొండకు ఎమ్మెల్సీ పదవి దక్కడం ఆయన రాజకీయ ప్రాధాన్యాన్ని కొనసాగించింది. ఇక్కడే అసలు పోటీకి మరో కోణం ఏర్పడింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ భూపాలపల్లి టికెట్ ఎవరికి? అనే ప్రశ్నకు ఇప్పుడే సమాధానం చెప్పలేని పరిస్థితి ఉన్నప్పటికీ, ఇద్దరు నేతల వర్గాలు మాత్రం తమ బలాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయన్న ప్రచారం ఉంది. 2025లో వచ్చిన రాజకీయ విశ్లేషణల్లోనూ గండ్ర, సిరికొండ వర్గాల మధ్య నియోజకవర్గ ఆధిపత్య పోరు, భవిష్యత్ టికెట్ అంశం ప్రధాన కారణాలుగా ప్రస్తావించబడ్డాయి.

### గండ్ర బలం ఎక్కడ

గండ్ర వెంకటరమణారెడ్డి ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ భూపాలపల్లిలో బీఆర్ఎస్ కార్యక్రమాలను చురుగ్గా నడుపుతున్నారు. 2026లో రైతు సమస్యలు, సింగరేణి అంశాలు, సాగునీరు, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై వరుసగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీ క్యాడర్‌తో అనుసంధానాన్ని కొనసాగిస్తున్నారు. సింగరేణి అంశంపై బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అలాగే గణపసముద్రంరామప్ప నీటి సమస్యపై క్షేత్రస్థాయిలో పర్యటించారు. అంతేకాదు, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిన కార్యక్రమానికి గండ్ర నేతృత్వం వహించారు. ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో టికెట్లు రాని ఆశావహులకు భరోసా ఇవ్వడం కూడా ఆయన కేడర్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెడుతున్నారనే సంకేతంగా కనిపించింది. అంటే గండ్ర వర్గం బలం ప్రధానంగా క్షేత్రస్థాయి నెట్‌వర్క్, ఎన్నికల నిర్వహణ అనుభవం, స్థానిక నాయకులతో నిరంతర సంబంధాలు అనే మూడు అంశాల చుట్టూ కనిపిస్తోంది.

### సిరికొండ బలం మరో రకం

ఇక సిరికొండ మధుసూదనాచారి బలం పూర్తిగా వేరే కోణంలో ఉంది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ రాజకీయాల్లో కొనసాగుతున్న సీనియర్ నాయకుడిగా ఆయనకు పార్టీ పాత క్యాడర్‌లో ప్రత్యేక గుర్తింపు ఉంది. 2014లో తెలంగాణ తొలి శాసనసభాపతిగా పనిచేసిన ఆయనకు ఉద్యమకారులు, పాత పార్టీ కార్యకర్తల్లో ఇప్పటికీ అనుబంధం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది.2025లో వచ్చిన ఒక విశ్లేషణలోనూ నియోజకవర్గంలోని పలుచోట్ల ఉద్యమ కాలం నాటి కార్యకర్తలు సిరికొండకు మద్దతుగా ఉన్నారని, తమకు పార్టీలో తగిన గుర్తింపు లభించలేదన్న అసంతృప్తి కొందరిలో ఉందని పేర్కొన్నారు. అందుకే సిరికొండ వర్గం చేస్తున్న ప్రధాన రాజకీయ వాదన "ఉద్యమం నుంచి పార్టీ కోసం పనిచేసిన పాత క్యాడర్‌కు గుర్తింపు" చుట్టూ తిరుగుతున్నట్లు కనిపిస్తోంది.



ఒక్కటైన సందర్భాలు ఉన్నా.. విభేదాలు మాత్రం పూర్తిగా పోలేదు గండ్రసిరికొండ మధ్య విభేదాలు కొత్తవి కావు. 2021లో ఇద్దరూ ఒకే వేదికపై కనిపించి పరస్పరం అభినందించుకోవడంతో భూపాలపల్లి బీఆర్ఎస్‌లో ఐక్యతకు సంకేతాలు కనిపించాయి. అప్పట్లో ఇరువర్గాలు కలిసి పనిచేస్తాయని పార్టీ శ్రేణుల్లో ఆశలు ఏర్పడ్డాయి. అయితే 2023లో జరిగిన కార్యక్రమాల్లోనే శిలాఫలకంపై పేరు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం బహిరంగమైంది. బీఆర్ఎస్ అగ్రనేతల సమక్షంలోనే నినాదాలు, పరస్పర నిరసనలు చోటుచేసుకున్నట్లు అప్పటి వార్తలు వెల్లడించాయి. అంటే అప్పటినుంచి ఉన్న అసంతృప్తి పూర్తిగా పరిష్కారం కాలేదని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

### ఇప్పుడు ఎందుకు మళ్లీ వేడి పెరిగింది?

రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారానికి దూరమైన తర్వాత ప్రతి నియోజకవర్గంలో పార్టీ భవిష్యత్ నాయకత్వం, క్యాడర్ పట్టు, వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిత్వం వంటి అంశాలు కీలకంగా మారాయి. భూపాలపల్లిలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. గండ్ర ఒకవైపు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతుండగా, సిరికొండకు అనుకూలంగా ఉన్న నాయకులు తమ వర్గానికి రాజకీయ ప్రాధాన్యం తగ్గుతోందనే భావనను వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సిరికొండపై వ్యక్తిగత విమర్శలు చేయొద్దంటూ ఆయన వర్గం బహిరంగంగా హెచ్చరించడం ఈ అంతర్గత పోరును మరింత స్పష్టంగా బయటకు తెచ్చింది. ఇదే సమయంలో గండ్ర వరుసగా పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వంపై ఆందోళనలు, రైతుసింగరేణి సమస్యలపై పోరాటాలతో తన రాజకీయ చురుకుదనాన్ని కొనసాగిస్తున్నారు.

### గ్రామస్థాయి క్యాడర్ ఎవరి వైపు?

ఇది భూపాలపల్లి బీఆర్ఎస్ భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశం. గండ్ర వర్గం ఎన్నికల యంత్రాంగం, స్థానిక నాయకత్వం, ప్రస్తుత పార్టీ కార్యకలాపాలపై పట్టు తమ బలమని భావిస్తోంది. సిరికొండ వర్గం మాత్రం ఉద్యమకారులు, పాత బీఆర్ఎస్ క్యాడర్, సీనియర్ నాయకులతో ఉన్న అనుబంధం తమ బలమని చెబుతోంది. దీంతో ఒకే గ్రామంలోనూ ఎవరి కార్యక్రమానికి ఎవరు వెళ్తారు? ఎవరి వెంట స్థానిక నాయకులు ఉంటారు? పార్టీ కార్యక్రమాలకు ఎవరు జనాన్ని సమీకరిస్తారు? వంటి అంశాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.



### అధిష్ఠానానికి అసలు పరీక్ష

భూపాలపల్లి వివాదం కేవలం ఇద్దరు నాయకుల వ్యక్తిగత విభేదంగా మిగిలితే పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చు. కానీ ఇది మండలాలు, గ్రామాలు, బూత్ స్థాయి వరకు విస్తరిస్తే బీఆర్ఎస్ ఎన్నికల యంత్రాంగానికే నష్టం.గతంలోనూ నియోజకవర్గంలోని గ్రూపుల అంశం పార్టీ అగ్రనేతల దృష్టికి వెళ్లింది. 2025లో కేటీఆర్ పర్యటన సందర్భంగా కూడా గ్రూపుల వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని కార్యకర్తలు ప్రస్తావించగా, నాయకులందరినీ కలుపుకొని వెళ్లాలని సూచించినట్లు సమాచారం. ఇప్పుడు పరిస్థితి మరోసారి అదే దిశగా వెళ్తుందా? లేక అధిష్ఠానం ముందుగానే జోక్యం చేసుకుని రెండు వర్గాలను ఒకే తాటిపైకి తెస్తుందా? అన్నదే కీలకం.

### గెలుపు ఎవరిది? నష్టం ఎవరికి?

ప్రస్తుతం గండ్రసిరికొండ పోరులో ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు అని తేల్చడం తొందరపాటు. ఎందుకంటే ఇది వ్యక్తుల మధ్య పోరుగా కనిపిస్తున్నప్పటికీ, అసలు పోటీ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ భవిష్యత్ నాయకత్వంపై.గండ్ర వర్గం బలపడితే మాజీ ఎమ్మెల్యే చుట్టూ పార్టీ భవిష్యత్ వ్యూహం తిరిగే అవకాశం ఉంటుంది. సిరికొండ వర్గం క్యాడర్‌ను బలంగా సమీకరించగలిగితే సీనియర్ నాయకుడి రాజకీయ ప్రాధాన్యం మళ్లీ పెరగొచ్చు.కానీ రెండు వర్గాలు పరస్పరం బలహీనపర్చుకునే స్థాయికి వెళ్తే లాభపడేది ప్రత్యర్థి పార్టీలే. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ భూపాలపల్లిలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత పార్టీకి ఇప్పుడు ప్రధాన అవసరం అంతర్గత ఐక్యత. ఈ సమయంలోనే గ్రూపు రాజకీయాలు ముదిరితే వచ్చే ఎన్నికల నాటికి క్యాడర్ మానసిక స్థైర్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.భూపాలపల్లి బీఆర్ఎస్‌లో ఇప్పుడు కనిపిస్తున్నది సాధారణ అసంతృప్తి కాదు.. రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న దీర్ఘకాల పోరాటానికి మరో దశ అన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఒకవైపు గండ్ర తన రాజకీయ ఉనికిని క్షేత్రస్థాయిలో బలపరుచుకుంటుండగా, మరోవైపు సిరికొండ వర్గం సీనియర్ నాయకుడి గౌరవం, ఉద్యమకారుల గుర్తింపు అంశాలను ముందుకు తెస్తోంది.ఇకపై జరిగే పార్టీ సమావేశాలు, నియోజకవర్గ పర్యటనలు, స్థానిక రాజకీయ పరిణామాలు ఈ రెండు వర్గాల్లో ఎవరి బలం ఎంత అన్నది బయటపెట్టే అవకాశం ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా "భూపాలపల్లి బీఆర్ఎస్‌కు నాయకుడు ఎవరు?" అనే ప్రశ్నకు పార్టీ అధిష్ఠానం ఎప్పుడు, ఎలా సమాధానం చెబుతుంది? అన్నదే ఇప్పుడు భూపాలపల్లి రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

EDITED, PRINTED, PUBLISHED, AND OWNED BY J. NARENDER. PRINTED AT: SREE SESHASAI ENTERPRISES, 3-88, CHANDRA THEATRE MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151 AT J.N. PUBLICATION, 76-6-01, BHATSING ROAD, CHAITANYA APTS, NEAR SWATHI CENTER, BHAVANIPURAM, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH – 521137. RNI NO.: APTEL/26/A0313 EDITOR: J. NARENDER CELL NO.: 9440897445 EMAIL: visionandhra1999@gmail.com

# స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశాభివృద్ధికి కృషి చేయాలి

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) : మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించిన స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి పునరంకితం కావాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో, తిరుమల హిల్స్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. 1947 ఆగస్టు 15న బ్రిటీష్ పాలన నుంచి విముక్తి లభించిందని, స్వాతంత్ర్యం అనేది కేవలం వేడుక మాత్రమే కాదని స్పష్టం చేశారు. హక్కులు, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ దేశ సమగ్ర అభివృద్ధి కోసం బాధ్యతగా పనిచేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా భారతదేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వనపర్తిలో మిన్నంటిన దేశభక్తి ఉత్సాహం

**- 80 మీటర్ల జాతీయ పతాకంతో బృహత్తర ర్యాలీ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) : భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వనపర్తిలోని సూర్యచంద్ర ప్యాలెస్ స్కూల్ (సిబిఎస్ఇ) ఆధ్వర్యంలో 80 మీటర్ల బృహత్తర జాతీయ పతాక ర్యాలీ అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక పాలిటెక్నిక్ మైదానం వద్ద ఉదయం 7:00 గంటలకు పాఠశాల డైరెక్టర్ దివ్య తేజ జండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. పాలిటెక్నిక్ మైదానం నుండి ప్రారంభమైన ప్రదర్శన సూర్యచంద్ర ప్యాలెస్ స్కూల్ ఆర్చ్ వరకు ఉదయం 8:00 గంటల వరకు కన్నులపండువగా సాగింది. ఈ ర్యాలీలో పాఠశాలకు చెందిన దాదాపు 450 మంది విద్యార్థులు, 40 మంది ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. 80 మీటర్ల పొడవైన జాతీయ జెండాను విద్యార్థులందరూ కలసికట్టుగా చేతుల్లో పట్టుకుని ప్రదర్శిస్తూ పట్టణ వీధుల్లో ముందుకు సాగారు. ర్యాలీ పొడవునా విద్యార్థులు చేసిన దేశభక్తి నినాదాలు మార్మోగాయి. దేశభక్తి, జాతీయ సమైక్యతా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహభరిత భాగస్వామ్యంతో ఈ స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీ అత్యంత వైభవంగా ముగిసింది.

# ఘనంగా వజ్రాల రమేష్ జన్మదిన వేడుకలు



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) : వనపర్తి పట్టణ రజక జనసేన యూత్ ప్రధాన కార్యదర్శి వజ్రాల రమేష్ జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని నల్లచెరువు సమీపంలో రజక జనసేన యూత్ ఆధ్వర్యంలో మొక్క నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించి వజ్రాల రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణ రజక సంఘం సభ్యులు ఆయన్ను శాలువాతో సత్కరించి, ఆశీస్సులు అందించారు. వజ్రాల రమేష్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ రజక సంఘం, జనసేన సభ్యులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీలో వనపర్తి జిల్లా ప్రథమం

**- 'సురక్ష కా తిరంగా' లో రాష్ట్రస్థాయి పురస్కారం**






వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర) సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో డిజిటల్ భద్రతపై అవగాహన పెంపొందించడంలో వనపర్తి జిల్లా పోలీస్ శాఖ రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఐసీసీసీ భవనంలో నిర్వహించిన "సురక్ష కా తిరంగా సైబర్ నేర రహిత తెలంగాణ" కార్యక్రమంలో సెక్యూర్డ్ ప్రొఫైలింగ్ విభాగానికి గాను ఈ అరుదైన గుర్తింపు దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వనపర్తి కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, సైబర్ ఎస్పై రవిప్రకాష్‌లకు ప్రజాప్రతినిధులు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా అధికారులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో వ్యాపిస్తున్న కొత్త తరహా సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖ సూచించింది. ఫేక్ యాప్స్, అనుమానాస్పద లింక్‌లు, ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ పెట్టుబడులు మరియు సోషల్ మీడియా మోసాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఈ విజయం జిల్లా పోలీసుల సమష్టి కృషికి నిదర్శనమని ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో సైబర్ నేరాల అడ్డుకట్టకు, ప్రజల డిజిటల్ రక్షణకు మరింత పటిష్టమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర): కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు తెలంగాణ చౌక్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు. అనంతరం నౌగాం బస్తీలోని ప్రజాబంధు పాల్వాయి పురుషోత్తం రావు విగ్రహం వద్ద కూడా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. యువత దేశభక్తిని పెంపొందించుకొని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. భారతదేశం ప్రపంచంలో మరింత ఉన్నత స్థానాన్ని సాధించేలా అందరూ కలిసి పనిచేయాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ స్ఫూర్తిని భావితరాలకు అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం పట్టణ ప్రజలకు, విద్యార్థులకు, యువతకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# పోలీస్ కమిషనరేట్ లో 8వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

## అత్యంత వైభవంగా నిర్వహించిన నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్,



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): సిటీ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పేట్ల బురుజులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గౌరవ వందనం స్వీకరించారు. దేశ స్వాతంత్ర్య సాధన కోసం ప్రాణాలర్పించిన సమరయోధులు, అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఘన నివాళులర్పించారు. అనంతరం విధి నిర్వహణలో అంకితభావం, విశేష ప్రతిభ కనబరిచిన 72 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ,ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఆహార కల్తీని సమూలంగా అరికట్టేందుకు ప్రత్యేకంగా హెచ్-ఫాస్ట్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల సమన్వయంతో పనిచేస్తూ.. కల్తీదారులపై జీరో టాలరెన్స్ విధానంతో వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకలు, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి శోభాయాత్రలతో పాటు ఇటీవల ముగిసిన చారిత్రక ఆషాఢ బోనాల ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిసేలా అహర్నిశలు బందోబస్తు నిర్వహించిన సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. సైబర్ నేరగాళ్ల ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు 'ఆపరేషన్ ఆక్టోపస్' ప్రారంభించామని, దేశంలోనే తొలిసారిగా తీసుకొచ్చిన 'సీ-మిత్ర' వర్చువల్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ ద్వారా ఇప్పటివరకు 1,700కి పైగా జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశామని వెల్లడించారు. ఫిర్యాదుల నమోదుకు 'ఏఐ కాప్‌రైటర్' యాప్ ఎంతగానో తోడ్పడుతోందన్నారు. ముఖ్యమంత్రిఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన 'స్పందన - తక్షణ రక్షణ' మహిళా రెస్పాండర్ వ్యవస్థ రోజుకు సగటున 30 ఫిర్యాదులను స్వీకరిస్తూ సత్వర సేవలు అందిస్తోందని, త్వరలోనే 300 మంది మహిళా సిబ్బందికి డ్రైవింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలో మాదకద్రవ్యాల నియంత్రణకు 'హెచ్-న్యూ' విభాగాన్ని మరింత బలోపేతం చేశామని, డ్రగ్స్ విషయంలో ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే, టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, డీసీపీ (అడ్మిన్) కె.వెంకట లక్ష్మి, అదనపు డీసీపీ బి.కిష్టయ్యలతో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**-సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రభుత్వ పాలన లక్ష్యం**

**- మంత్రి దామోదర రాజనర్సింహ**

**-స్వయం సహాయక సంఘాలకు రూ.225 కోట్ల రుణాల పంపిణీ**



సంగారెడ్డిబ్యూరో , ఆగస్టు :15(విజన్ ఆంధ్ర ) : నెహ్రూ, ఇందిరమ్మ అందించిన సంక్షేమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు తదితర వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.225 కోట్ల విలువైన రుణాల చెక్కును మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు, చిన్నతరహా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలి

**- ఐడిఓసిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**- వచ్చే ఆగస్టు 15 నాటికి జిల్లా అనేక రంగాల్లో ముందంజలో ఉండేలా పనిచేయాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**



గద్వాల ఆగస్టు 15 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధికి అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం ఐడిఓసి ఆవరణ వద్ద జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముందుగా కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న వారందరికీ, ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఏమైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకుంటూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ముందుకెళ్లాలన్నారు. గాంధీజీ, నెహ్రూజీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లాల్ బహుదూర్ శాస్త్రి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ తదితర ఎంతో మంది మహనీయుల త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్య, ప్రజాస్వామిక దేశంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. జోగులాంబ గద్వాలను వెనుకబడ్డ జిల్లా అనే పేరును రూపు మాపేందుకు పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి జిల్లా అనేక రంగాల్లో రాష్ట్రంలోనే ముందంజలో ఉండేలా పనిచేస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో కుటుంబ సభ్యులు, క్యాంపు కార్యాలయ సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా




మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 15(విజన్ ఆంధ్ర)80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శనివారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులను, సిబ్బందిని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలు, అధికారులు, సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం లభించేందుకు స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు, పోరాటాలను ఈ సందర్భంగా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులకు స్వాతంత్ర్య పోరాట చరిత్ర, సమరయోధుల త్యాగాలు, దేశానికి స్వాతంత్ర్యం ఎలా లభించింది, రాజ్యాంగం ద్వారా ప్రజలకు లభించిన హక్కుల గురించి తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం పిల్లలు ఇంటర్నెట్, విద్య, వైద్యం తదితర అనేక సౌకర్యాలను అనుభవిస్తున్నారని, ఈ సౌకర్యాలు, హక్కులు ఎలా సాధ్యమయ్యాయో వారికి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాల గురించి కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా పిల్లలతో చర్చించడం ద్వారా దేశభక్తి, బాధ్యతాయుత పౌరసత్వం వంటి విలువలను వారిలో పెంపొందించవచ్చని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి ఒక్కరికీ ఎంతో గర్వకారణమైన, స్ఫూర్తిదాయకమైన పర్వదినమని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) ఎ. నిర్మల, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మేయర్ దర్ని మధుకర్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 15,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్,డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, మున్సిపల్ కమిషనర్ జి. అన్వేష్ తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా మేయర్ మధుకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మార్గదర్శకత్వంలో మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేస్తున్నామని మధుకర్ తెలిపారు.అనంతరం గాంధీ పార్కు, ముఖరం చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ప్రజల సహకారంతో మంచిర్యాల నగరాన్ని మరింత అభివృద్ధి చెందిన, పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.అనంతరం మేయర్ ప్రజలకు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మరియు మంచిర్యాల నగర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాజ్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ వైకుంఠం, స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు.. 15 రోజుల్లో పంపిణీ

**- జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం**

**- తొలివిడతగా 150 మందికి కార్డులు అందజేత**



గద్వాల ఆగస్టు 15 ( విజన్ ఆంధ్ర కరస్పాండెంట్) : అర్హత ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తోందని వెల్లడించారు. అర్హత కలిగిన వారు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జోగులాంబ గద్వాల జిల్లాలో శనివారం శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో పాటు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. 1.90 లక్షల మందికి స్మార్ట్ కార్డులు జిల్లాలో సుమారు 1.90 లక్షల రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తొలివిడతగా 150 మంది లబ్ధిదారులకు కార్డులు అందిస్తున్నామని, మిగిలిన వారందరికీ వచ్చే 15 రోజుల్లో రేషన్ షాపుల డీలర్ల ద్వారా కార్డులను పంపిణీ చేస్తామని చెప్పారు. సర్పంచులు, గ్రామ కార్యదర్శుల సమక్షంలో ప్రతి లబ్ధిదారుడి ఇంటికి కార్డు చేరేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఒకేసారి ప్రారంభించడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సమర్థంగా చేరేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు.

**నిరంతరంగా దరఖాస్తుల స్వీకరణ**

అర్హులైన నిరుపేద కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తోందని, అర్హత ఉన్న ప్రతి కుటుంబం మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**బియ్యం పంపిణీలో పారదర్శకత**

ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పక్కదారి పట్టకుండా, అర్హులైన లబ్ధిదారులకే చేరేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. టీ-రేషన్ యాప్ ద్వారా రేషన్ బియ్యం పంపిణీని మరింత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. రేషన్ షాపుల ద్వారా అందుతున్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని దుర్వినియోగం చేసినా, అక్రమాలకు పాల్పడినా పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవినీతికి తావులేకుండా పంపిణీ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచడంతో పాటు అవినీతికి ఆస్కారం లేకుండా కొత్త కార్డులను రూపొందించారని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డు చేరేలా రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి లబ్ధిదారుడికి కార్డు చేరాలి అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు మాట్లాడుతూ పేద ప్రజలకు రేషన్ బియ్యం పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించిందన్నారు. కార్డుల పంపిణీలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించడం అభినందనీయమన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం సుమారు 12 ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం కార్డులు మంజూరు చేయడం హర్షణీయమని తెలిపారు. ప్రజలకు ఆకట్టుకునే రీతిలో రూపొందించిన స్మార్ట్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సమర్థంగా అందే అవకాశం ఉందన్నారు. ప్రతి గ్రామంలో రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు కార్డులు అందేలా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నల్ల హనుమంతు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రేషన్ షాపుల డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.